THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 52 31.05.2024, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




# జయం మనదే!

## దేశంలో మోడీ Vs రాహుల్.. రాష్ట్రంలో జగన్ Vs బాబు



### ఎవరి ధీమా వారిది.. ఎవరి లెక్కలు వారివి!

### కౌంటింగ్‌కి కౌంట్‌డౌన్

### నేతల గుండెల్లో టెన్షన్.. అధికార వర్గాల అటెన్షన్!



*కళ్ళు చిదంబరం హీరోగా, బండ జ్యోతి హీరోయిన్‌గా సినిమా తీసే నిర్మాత కూడా తన సినిమా సూపర్‌హిట్ అనే ధైర్యంతో ఉంటాడు. ఒకే ఒక్క చివరి బంతితో ఆరు పరుగులు తీయాలన్న లక్ష్యం ముందున్న క్రికెట్ క్రీడాకారుడు తమ జట్టే గెలవబోతుందన్న ధీమాతో చివరి బంతిని ఎదుర్కొంటాడు. ఇలా అనేక రంగాలలోని వ్యక్తులు పలు సందర్భాలలో ఇదే ఆత్మస్థైర్యంతో తామే విజయం సాధించాలన్న లక్ష్యంతో ప్రయత్నాలు సాగిస్తుంటారు. ఎన్నికల పోరులో కూడా అంతే. కుండ గుర్తుపై బరిలో దిగే నీళ్ల వెంకయ్య, గుడ్డు గుర్తుతో పోటీచేసే కోళ్ల అంకమ్మ కూడా తామే గెలిచినట్లుగా, ప్రమాణస్వీకారం చేసినట్లుగా కలలు కంటుంటారు. తాజాగా ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కే.ఏ.పాల్ కూడా ఇదే తరహాలో తానే గెలవబోతున్నానన్న ధీమాతో చేస్తున్న ప్రకటనలు, చేపడుతున్న కార్యక్రమాలు మనం రోజూ వింటూనే ఉన్నాం, వార్తలలో చూస్తూనే ఉన్నాం. అదే తరహాలో ఈ ఎన్నికలలో పోటీచేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర్య అభ్యర్థులు, కొత్తగా పార్టీ పెట్టి మమ్మల్ని గెలిపిస్తే.. పొడిచేస్తాం అని బరిలోకి దిగిన మాజీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ, తామే గెలవబోతున్నాం అన్న నమ్మకంతో, ఎవరి ధీమాలో వారు ఉన్నారు.*

దేశంలో, రాష్ట్రంలో జరిగిన 2024 సార్వత్రిక ఎన్నికల చివరి అంకం దగ్గర పడింది. ముగింపు ఘట్టానికి త్వరలో తెరపడబోతోంది. ఎన్నికల కౌంటింగ్‌కి కౌంట్‌డౌన్ కూడా మొదలయ్యింది. మరో నాలుగు రోజులలో జూన్4 రాబోతుంది. పార్టీలు, నేతల భవిష్యత్తు ఆరోజున తేలిపోనుంది.

ఎన్నికల తంతు ముగిసేవరకూ ప్రజల మధ్యలో తిరిగిన నాయకులు, పోలింగ్ ముగిసిన పక్కరోజే గాలిలో ఎగిరిపోయారు. వారి వారి అభిరుచులకు తగ్గట్లుగా, తమ స్థోమతకి తగినట్లుగా అగ్ర నేతలతో సహా అందరూ విదేశ విహార యాత్రలకి వెళ్లిపోయారు.

దేశం మొత్తంమీద ఏడు విడతలుగా జరిగిన పోలింగులో మొదటి అయిదు దశలలో ఎన్నికలు జరిగిన ప్రాంతాలలోని నేతలకి మాత్రమే ఈ అదృష్టం దక్కింది. అలసట, ఆయాసం తీర్చుకునే అవకాశం లభించింది. చివరి రెండు దశల్లో ఎన్నికలు జరిగే ప్రాంతాలవారికి పాపం ఆ ఛాన్స్ లేదు.

జూన్ 1వ తేదీ సాయంత్రం 6 గంటలకి ఎన్నికలు ముగుస్తాయి. అదేరోజు సాయంత్రం 6.30 నుండి ఎగ్జిట్ పోల్స్‌తో సర్వే సంస్థలు హోరెత్తిస్తాయి. జూన్ 4వ తేదీ సాయంత్రానికి అందరి జాతకాలు తేలిపోతాయి.

### కేంద్రంలో... మోడీ VS రాహుల్!

రాజకీయ శ్రేణులు, విశ్లేషకులు పలు సందర్భాల్లో పేర్కొన్నట్లుగా దేశ, రాష్ట్ర రాజకీయాలని 2014కి ముందు ఆ తరువాత అన్నట్లుగా చూడాలి. కేంద్రంలో తనకి ఎదురులేదన్నట్లుగా 2014 వరకూ చక్రం తిప్పిన కాంగ్రెస్‌పార్టీ, ఆ తరువాత డీలా పడిపోయింది. 2014 ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన కమలదళం ప్రజాక్షేత్రంలో అప్రతిహతంగా దూసుకుపోయింది. మళ్ళీ 2019లో కూడా ప్రజాదరణ పొంది

10లో







## బెట్టింగ్ రాయుళ్ళతో హోటళ్ళు ఫుల్లు

## జూన్ 3, 4 తేదీలలో రూములు నిల్లు

ఈసారి జరగనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ చాలా ప్రత్యేకతలని సంతరించుకుంది. అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ ఇవి చరిత్రాత్మక ఎన్నికలు. కేంద్రంలో ఫలితాలెలా ఉండబోతున్నాయోనని ప్రపంచ దేశాలు ఆసక్తితో ఎదురు చూస్తున్నాయి. అదేవిధంగా ఆంధ్ర ప్రజల తీర్పు ఎలా ఉండబోతుందోనని దేశంలోగల ఇతర రాష్ట్రాలలోని పార్టీలు, ఆయా పార్టీల నాయకులు ఉత్కంఠతో చూస్తున్నారు. ప్రత్యక్ష ఎన్నికలలో అభ్యర్థులుగా పోటీచేసి, వందల కోట్ల రూపాయలు మంచినీళ్లలా ఖర్చుచేసేసి, తమ భవిష్యత్తు ఏమిటి భగవంతుడా అని నేతలు ఎదురు చూస్తున్నారు. సందట్లో సడేమియ్యా..

10లో

# కౌంటింగ్‌కు భారీ ఏర్పాట్లు

- వెయ్యిమంది సిబ్బందితో ఓట్ల లెక్కింపుకు చర్యలు
- మూడంచెల భద్రత..భారీ పోలీసు బందోబస్తు



అందరూ ఆతృతగా ఎదురుచూస్తున్న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు ఉన్నతాధి కారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, నియమ నిబంధనలు పాటిస్తూ, ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులు సిబ్బందికి తగు సూచనలిస్తు న్నారు. జూన్ 4వ తేదీ ఉదయం 8 గంట లకు నెల్లూరు సమీపంలోని కనుపర్తి పాడులో ఉన్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు ప్రారంభమవు తుంది. జిల్లాలో మొత్తం 19,44,285 ఓట్లు ఉండగా, 15,48,183 ఓట్లు పోల య్యాయి. తొలుత పోస్టల్‌బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. అనంతరం, 8.30గంటల నుంచి ఈవీఎంలలో ఓట్లను లెక్కిస్తారు. ఇందుకోసం జిల్లాలోని 8 నియోజకవర్గాలకు సంబంధించి ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 14 టేబుళ్ల వంతున ఏర్పాటుచేస్తున్నామని, లెక్కింపు సజావుగా జరిగేందుకు ఇప్పటికే ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు శిక్షణ ఇచ్చామని, సిబ్బందికి కూడా శిక్షణ ఇస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఈనెల 25న వెల్లడించారు. కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం నలు గురు పరిశీలకులను నియమించిందని, వారి పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు జరుగు తుందని తెలిపారు. పరిశీలకులు సంతకం చేసిన తర్వాతనే కౌంటింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని, అదేవిధంగా, వారు సంతకం చేసిన తర్వాత మాత్రమే రౌండ్ల వారీగా ఫలితాలను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రంపై డ్రోన్లు ఎగర కుండా రెడ్‌జోన్‌గా ప్రకటించామన్నారు. సాయుధ పోలీసులు, సిఆర్‌పిఎఫ్ పోలీసు లతో మూడంచెల భద్రత ఏర్పాటుచేశా మని, కౌంటింగ్ కేంద్రం వద్ద సుమారు 140 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి పూర్తి స్థాయిలో నిఘా పెట్టామని చెప్పారు. ఓట్ల లెక్కింపు అనంతరం, గెలిచిన అభ్యర్థులు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించుకు నేందుకు అనుమతులు లేవని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీచేసి ఉందన్నారు. రాజకీయ పార్టీలు సహక రించాలని, కౌంటింగ్ ప్రక్రియను జయ ప్రదంగా జరిగేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు, జేసీ సేతుమాధవన్, నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్, అదనపు ఎస్పీ సౌజన్య, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# జొన్నవాడకు బ్రహ్మోత్సవ శోభ

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో ఈనెల 28వ తేది నుంచి బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా ప్రారంభ మయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలంకరణలతో దేదీప్యమానం చేశారు. ఆలయ అధికారులు, జిల్లా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో భక్తులకు భద్రత, మౌలిక సదుపాయాలు కలిగి స్తున్నారు. నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు అన్నప్రసాద వితరణకు ఏర్పాట్లు చేశారు. జూన్ 7వ తేదీవరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ప్రధానంగా జూన్1 సింహవాహన సేవ, 2న హంస వాహనం, 3న రావణసేవ, 4న పెద్ద వెండినంది సేవ, 5న రథోత్సవం, 6వ తేది ఉదయం కల్యాణోత్సవం, సాయంత్రం అంగరంగ వైభవంగా తెప్పోత్సవం జరుగనున్నాయి.

## శ్రీ వేంకటేశ్వరాలయానికి..
# భోగ శ్రీనివాసుని విగ్రహం సమర్పణ



పొదలకూరు పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానా నికి స్థానికులైన చీమకుర్తి శివ కుమార్-వాణి దంపతులు ఇటీవల రూ.11 లక్షలు వెచ్చించి 10 కిలోల వెండితో భోగ శ్రీని వాసుని విగ్రహం తయారు చేయించి సమర్పించారు. ఆ విగ్రహానికి ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేయించి, దాతలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల రమణయ్యనాయుడు మాట్లాడుతూ, త్వరలో ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో దాతలు ఎంతో అపురూపమైన భోగ శ్రీనివాసుని విగ్రహమూర్తిని ఆలయానికి సమర్పించడం భగవత్ సంకల్పమని సంతోషం వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి, దేవరం రఘురామిరెడ్డి, ఎం.శ్యామ్ ప్రసాద్, వేణుగోపాల్, మురళి తదితరులు పాల్గొన్నారు.

## కామాక్షితాయి హుండీ
# ఆదాయం.. రూ.30.55 లక్షలు

జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానానికి మార్చి 21 నుంచి మే 27వ తేది వరకు 68 రోజులకు గాను హుండీ కానుకల ద్వారా 30,66,976 రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఇఓ గిరికృష్ణ తెలిపారు. భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను ఈనెల 27న లెక్కించారు. ఈ లెక్కింపులో ఆలయ ఇఓతో పాటు దేవాదాయశాఖ అధికారులు వెంకగసుబ్బయ్య, చైతన్య పాల్గొన్నారు.

# విద్యుత్ చౌర్యంపై కేసులు

- రూ. 3 లక్షల జరిమానాలు

విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వినియోగదారులను విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు గుర్తించి కేసులు నమోదు చేస్తు న్నారు. ఇటీవల నెల్లూరు నగరంలోనూ, నెల్లూరు రూరల్, కోవూరు ప్రాంతాల్లోను ఇళ్లలో, రొయ్యలగుంటల వద్ద విద్యుత్‌ను అక్రమంగా వాడుకుంటున్న వారిపై కేసులు పెట్టి, దాదాపు 3లక్షల రూపాయల జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో విద్యుత్ శాఖ డీపీఈ, ఏపీఎస్‌పీడీసీఎల్ సర్కిల్ అధికారులు పాల్గొన్నారు. విద్యుత్ అక్రమ వాడకాన్ని సహించేది లేదని వారు హెచ్చరించారు.

# పెంచలకోనకు పెరిగిన హుండీ రాబడి



జిల్లాలోని ప్రముఖ నారసింహ క్షేత్రమైన పెంచలకోన శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవాలయానికి బ్రహ్మోత్సవాల్లో హుండీ ఆదాయం పెరిగింది. ఈనెల 19 నుంచి జరి గిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాల్లో ఏర్పాటుచేసిన తాత్కాలిక హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలు 33,76,445 రూపాయలు వచ్చాయి. ఇది గత ఏడాది కన్నా 9,49,663 రూపాయలకు పెరగడం విశేషం. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయసాగర్‌బాబు పర్యవేక్షణలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొని ఈ లెక్కింపు చేపట్టారు.

# ఆకట్టుకున్న..ఆర్‌ఎస్‌ఎస్ మహిళాశక్తి ప్రదర్శన



ఆర్‌ఎస్‌ఎస్ మహిళాశక్తి విభాగం రాష్ట్ర సేవికా సమితి ఆధ్వర్యంలో ఈనెల 27న బుచ్చిరెడ్డిపాళెంలోని పెద్దూరులో జరిగిన రూట్‌మార్చ్ స్థానికులను ఆకట్టుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ కార్యవాహక్ మధులత ఆధ్వర్యంలో 118 మంది మహిళలు అక్కడి వీధుల్లో పథ సంచలనం (రూట్ మార్చ్) చేశారు. మాతృమూర్తులు, మహిళల్లో ఆత్మ విశ్వాసం కలిగించేందుకు, ఆత్మరక్షణతో పాటు సనాతన ధర్మం పట్ల అవగాహన కలి గించేందుకు, దేశభక్తిని పెంపొందించేందుకు కర్రసాము, యోగా, కరాటే శిక్షణా తరగ తుల్లో భాగంగా ఈ ప్రదర్శన చేపట్టారు. స్థానిక మూడు లాంతర్ల సెంటర్ నుంచి కొత్త బస్టాండ్, పార్క్ సెంటర్, పెద్దబస్టాండ్, గాంధీబొమ్మసెంటర్‌ల మీదుగా సాగిన ఈ ప్రదర్శనలో అఖిలభారత సేవికాసమితి కార్యవాహక్ అన్నదానం సీతగాయత్రి, రాష్ట్ర సంచాలక్ డాక్టర్ సోమేశ్వరి, ప్రాంత కార్యవాహక్ వెంకటభాను, కృష్ణవేణి తదితరులతో పాటు ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్‌చాలక్ నేలనూతల శ్రీధర్, బాలు సుబ్బారావులతో పాటు బీజేపీ జిల్లా శాఖ అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

# ఏటీఎంను దోచుకున్న దొంగలు

- గ్యాస్‌కట్టర్‌తో లాకర్ తెరిచారు
- రూ. 2.45 లక్షలతో ఉడాయించేశారు



జిల్లాలో దొంగతనాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఇళ్ళలోకి అలికిడి లేకుండా వచ్చి దొంగతనాలు చేసేవాళ్ళు, తాళాలు వేసి ఉన్నా పగలగొట్టి మరీ దోచుకు పోయేవాళ్లు అధికమయ్యారు. రాత్రి పగలు తేడా లేకుండా దొంగలు ఎక్కడ వీలు దొరి కితే అక్కడంతా దొంగతనాలు చేస్తున్నారు. తాజాగా, ఏటీఎంలో కూడా దొంగతనానికి ప్రణాళిక వేసుకున్నారు. సీసీ కెమెరాలకు కూడా దొరక్కుండా డబ్బు దోచుకుపోయా రంటే దొంగలెంత తెలివిగా దొంగతనాలు చేస్తున్నారో తేటతెల్లమవుతుంది. నెల్లూరు సమీపంలోని పడారుపల్లిలో ఆదివారం రాత్రి 12.50 గంటల సమయంలో నలుగురు దుండగులు ఎస్‌బీఐ ఏటిఎంలోకి వెళ్లి చోరీకి పాల్పడడం సంచలనం కలిగించింది. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పడారుపల్లిలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగలు చోరీకి పాల్పడ్డారని, తొలుత, అక్కడున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, ఆ తర్వాత గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం లాకర్‌ను కట్‌చేశారని, దీంతో ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయంలో అలారం మోగడంతో వెంటనే బ్యాంకు సిబ్బంది, పోలీసులు అప్రమత్తమై ఏటిఎం వద్దకు వచ్చేటప్పటికే దొంగలు అందులో ఉన్న 2,45,000 రూపాయలు తీసుకుని పరారయ్యారని తెలిపారు. ఈ సమాచారం అందుకున్న వెంటనే వేదాయపాళెం ఇన్స్‌పెక్టర్ పీవీ నారాయణ అప్రమత్తమై పోలీసు సిబ్బందితో నగరంలో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. నగర డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి హుటాహుటిన వచ్చి ఏటిఎంను పరిశీలించారు.

# వైభవంగా విశ్వేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఇందుకూరుపేట మండలం మైపాడులో కొలువైవున్న అన్నపూర్ణాంబ సమేత శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ఇటీవల 9రోజుల పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఆలయ అర్చకులు బండారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో ఆదిదంపతులను ఉత్సవాల చివరి రోజున విశేషపుష్పాలతో అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. వల్లూరు కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

# నారాయణను మెచ్చుకున్న చంద్రబాబు



తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమం కోసం తన సొంతనిధులతో ఏటా 10 కోట్ల రూపాయలను కేటాయించిన సమాచారం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నెల్లూరు టీడీపీ అభ్యర్థి నారాయణ సేవా భావంతో చేపట్టిన ఆ కార్యక్రమాన్ని మెచ్చుకుని నారాయణను అభినందించారు. కార్యకర్తలను ఆదుకునేందుకు రూ.10 కోట్లు కేటాయించడం మంచి ఆలోచన అంటూ కొనియాడారు. దుబాయ్‌లో ఉన్న చంద్రబాబు నారాయణతో ఫోన్‌లో మాట్లాడి, ఆ డబ్బును ఎలా వినియోగించాలను కుంటున్నారు, దాని విధివిధానాలేమిటని నారాయణను అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత, రాష్ట్ర పార్టీ కార్యాలయానికి ఫోన్ చేసి, నారాయణ ఏర్పాటు చేయనున్న సంక్షేమనిధి గురించి రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీ నాయకులందరికీ తెలియజెప్పాలని, నారాయణను స్ఫూర్తిగా తీసుకుని నియోజకవర్గ స్థాయిలో ప్రతి నాయకుడు కార్యకర్తల సంక్షేమం కోసం ఎవరి వంతు వారు ఎంతోకొంత సేవ చేసేలా కార్యాచరణ చేపట్టాలని చంద్రబాబునాయుడు పార్టీశ్రేణులకు సూచించారు.

### పేదల కోసం..

# ఉద్యమాలు చేసిన జక్కా వెంకయ్య

## ఆయన సేవలు చిరస్మరణీయమన్న సీపీఎం నాయకులు



పేదలు, బలహీనవర్గాల వారి అభ్యున్నతి కోసం సీపీఎం నేత, దివంగత జక్కా వెంకయ్య చేసిన పోరాటాలు, ప్రజల సమస్యల పరిష్కారానికి చేసిన సేవలు చిరస్మరణీయమని సీపీఎం సీనియర్ నాయకుడు, రాజ్యసభ మాజీ సభ్యుడు పెనుబల్లి మధు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. జక్కా వెంకయ్య వర్థంతి సందర్భంగా ఈనెల29న నెల్లూరులోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ, జక్కా వెంకయ్యను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని, ఆయన ఆశయాల బాటలో నడవాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పాల్గొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

**పాతవెల్లంటిలో రక్తదాన శిబిరం :**

దివంగత సీపీఎం నేత జక్కా వెంకయ్య సేవలను స్మరించుకుంటూ నెల్లూరు రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో సీపీఎం ఆధ్వర్యంలో వర్థంతి కార్యక్రమాలు జరిగాయి. పాతవెల్లంటిలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, సీపీఎం నాయకులు కార్యకర్తలు రక్తదాన శిబిరం నిర్వహించారు. రూరల్ మండల సీపీఎం కార్యదర్శి ఆలూరు తిరుపాల్, నాయకులు పూడిపర్తి జనార్దన్, పల్లవరపు చెంచయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# కౌంటింగ్ ఏజెంట్లకు ఐడీ కార్డులు



జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనబోతున్న ఏజెంట్లకు ఈనెల 29న ఐడీ కార్డులు అందజేశారు. కార్పొరేషన్ కమిషనర్, నెల్లూరు సిటీ నియోజక వర్గం రిటర్నింగ్ అధికారి వికాస్‌మర్మత్ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంట్రల్ విభాగంలో ఏజెంట్లకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను పరిశీలించారు. కౌంటింగ్ జరగనున్న ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలకు ఏజెంట్లు నిర్దేశిత సమయానికి రావాలని, ఎన్నికల సంఘం జారీచేసిన ఐడీ కార్డులను విధిగా ధరించాలని చెప్పారు. ఏఆర్‌ఓ శర్మద పాల్గొన్నారు.

# చిన్నారులకు జేవీవీ శిక్షణ



జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. చెత్త కాగితాలతో వివిధ డిజైన్లు రూపొందించడం, ఫోటో ఫ్రేమ్‌లు తయారుచేయడం, ఆటపాటలు నేర్పడం ద్వారా వారిలో మానసిక వికాసం కలిగిస్తుండడంతో చిన్నారులు ఈ కార్యక్రమాలకు ఆసక్తిగా వస్తున్నారు. విత్తనాలు ఎలా మొలకెత్తుతాయో జేవీవీ మహిళా విభాగం నేత విజయమ్మ వారికి తెలియజెప్పారు. జేవీవీ ప్రతినిధులు పాల్గొని బాల బాలికలకు పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

# మూడు రోజులు మందు బందు!

## కౌంటింగ్ సందర్భంగా జూన్ 3, 4, 5 తేదీల్లో మద్యం అమ్మకాలు నిలిపివేత



సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జూన్ 4న జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా జూన్ 3, 4, 5తేదీల్లో మద్యం అమ్మకాలను నిలిపివేయాలని అన్ని జిల్లాల అధికారులను రాష్ట్ర పోలీసు బాసు ఆదేశించారు. సహజంగా ఏ ఎన్నికలప్పుడైనా కౌంటింగ్ జరిగే రోజు ఉదయం నుండి ఆరోజు రాత్రివరకు మద్యం అమ్మకాలు నిలిపివేయడమన్నది అనాదిగా వస్తున్న ఆనవాయితీ.

కానీ, ఈసారి అధికారులు ఎన్నికల లెక్కింపుకి ఒకరోజు ముందు ఆ తరువాత ఒక రోజు కూడా మందు బందు చేశారు.

మొత్తంమీద ఈసారి ఎన్నికలలో మద్యం విషయంలో ఎన్నికల సంఘం అప్రమత్తతో వ్యవహరించిందనే చెప్పొచ్చు. ఎన్నికల కోడ్ అమలు వున్నన్ని రోజులు కూడా మద్యం అమ్మకాలని నియంత్రించడానికి అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఎన్నికల సంఘం సూచన మేరకు సాధారణ రోజుల్లో జరిగే అమ్మకాల కంటే ఎక్కువ అమ్మకుండా మద్యం దుకాణాలను కట్టడి చేసింది. ఇక రాష్ట్రంలో పోలింగ్ అనంతరం జరిగిన అల్లర్లని దృష్టిలో పెట్టుకుని ఈసారి మూడు రోజుల పాటు మందు అమ్మకాలని అధికారులు నిషేధించారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని హోటల్స్, లాడ్జీలలో తనిఖీలు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకోవాలని కూడా రాష్ట్ర పోలీసు బాసు ఆదేశాలిచ్చారు.

మూడురోజులు మందు దొరకదని వార్తలు రావడంతో మద్యపానప్రియులు అప్రమత్తమయ్యారు. మూడురోజులకి సరిపడా సరుకుని నిల్వ చేసుకోవడానికి దుకాణాల ముందు క్యూ కడుతున్నారు. మద్యం సేవించిన ఏజెంట్లని, నాయకులని వారి అనుచరులని కూడా లెక్కింపు కేంద్రాల పరిసరాలలోకి సైతం రానీయబోమని ప్రకటిస్తే... అసలు అల్లర్లకు అవకాశమే ఉండదేమో. చూద్దాం... ఎవరి ఉపాయాలు వారికి ఉంటాయి కదా!

# దేశ రాజధానిలో భానుడి భగభగలు!

## ఢిల్లీలో 52.3 డిగ్రీల రికార్డు స్థాయి ఉష్ణోగ్రత




రోహిణి కార్తెలో రోళ్ళు పగిలే ఎండలు కాస్తాయనే మాట నిజమయ్యింది. మే 29వ తేదీ బుధవారం నాడు ఎప్పుడూ లేని విధంగా దేశ రాజధాని కొత్త ఢిల్లీలో అత్యధికంగా 52.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఉత్తర భారతంలో భానుడి భగభగలకు గత వారం రోజులుగా ప్రజలు అల్లాడిపోతున్నారని వార్తలొస్తున్నాయి. ఢిల్లీ చరిత్రలో ఇది అత్యధిక ఉష్ణోగ్రతలుగా వాతావరణ శాఖ అధికారులు చెప్తున్నారు.

గతంలో ఎప్పుడు కనీవినీ ఎరుగని స్థాయిలో ఢిల్లీలోని ముంగేష్‌పూర్ ప్రాంతంలో అత్యంత భారీస్థాయిలో 52.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదయ్యింది. దక్షిణ భారతదేశంలో కొన్నిచోట్ల తొలకరి జల్లులు పులకరింప చేస్తుంటే, ఉత్తర భారత దేశంలో మాత్రం ఎండలు మండుతున్నాయి. ఓవైపు ఎండల తీవ్రత ప్రజలని అల్లాడిస్తుంటే, మరోవైపు ఢిల్లీలో నీటిని వృథాచేసిన వాళ్లకు అధికారులు వేల రూపాయల్లో జరిమానా విధిస్తున్నారు. ఎండల తీవ్రత కారణంగా ఢిల్లీలో కరెంటు డిమాండ్ కూడా పెరిగిందని అధికారులు చెప్తున్నారు. గత మూడు నాలుగు రోజులుగా ఢిల్లీలో అత్యంత అధికంగా విద్యుత్ వినియోగం జరిగిందని అధికారులు లెక్కలు చెప్తున్నారు. గతంలో 51డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదుకాగా ఈసారి అది 52.3కి చేరిందని వాతావరణ శాఖ నిపుణులు చెప్తున్నారు. ప్రపంచం మొత్తంలో వాతావరణంలో వస్తున్న మార్పులకి ఈ ఉష్ణోగ్రతలు ఉదాహరణగా పేర్కొనవచ్చని వాళ్ళు అభిప్రాయపడుతున్నారు. ఓవైపు రాజకీయ వేడి... మరోవైపు భానుడి దాడితో ఢిల్లీవాసులు బెంబేలెత్తిపోతున్నారని సమాచారం!

### నియామవళిని ఉల్లంఘించిన..

# ఏపీఎం సస్పెండ్

ఎన్నికల సంఘం నియమావళిని ఉల్లంఘించిన కోవూరు మండలం వైఎస్సార్ క్రాంతిపథం ఇన్‌చార్జి ఏపీఎం వెంకటస్వామి సస్పెండయ్యారు. విచారణలో ఆయన నియమావళిని ఉల్లంఘించినట్లు తేలడంతో డిఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ఈనెల 29న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ స్థానంలో ఇందుకూరుపేట మండల ఏపీఎం రవిశంకర్‌ను అదనపు బాధ్యతలతో నియమించారు.

# నేత్రదానం

సూళ్ళూరుపేట బాపూజీకాలనీలో నివసిసస్తున్న మాలేపాటి అనసూయమ్మ (77) ఈనెల 29న మరణించగా, ఆమె కుటుంబసభ్యుల అంగీకారంతో పట్టణంలోని భరద్వాజ సేవాసంస్థ వారు ఆమె నేత్రాలనుంచి కార్నియాను సేకరించి చెన్నైలోని శంకర నేత్రాలయకు పంపారు. ఇది తాము సేకరించిన 436వ నేత్రదానమని ఆ సేవాసంస్థ వారు ఈ సందర్భంగా తెలిపారు.

# మంచిగా మెలగాలి



సమాజంలో మంచిగా మెలగాలని, చెడు అలవాట్లను విడిచిపెట్టి అందరితో సత్ప్రవర్తనతో ఉండాలని కావలి అడిషనల్ జుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జి.విక్రమ్‌సిన్హా ఖైదీలకు సూచించారు. ఈనెల 29న కావలి సబ్‌జైలులో లోక్ అదాలత్ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని ఖైదీలకు మానవీయ విలువలను బోధించారు. చట్టాలపై కూడా అవగాహన కలిగించారు. లీగల్ ఎయిడ్ మెంబర్ సాయి ప్రసాద్, లోక్‌అదాలత్ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# శివశంకరయ్యకు డా. అంబేద్కర్ అవార్డు





ప్రముఖ దారపు శిల్పి, సాహితీవేత్త, మర్రిపాడు మండలంలోని చుంచులూరు ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మున్నెల్లి శివశంకరయ్య డా. అంబేద్కర్ అవార్డు–2024కు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని కళానిలయం వారు డా.బిఆర్ అంబేద్కర్ 133వ జయంతి మహోత్సవాల సందర్భంగా డా. అంబేద్కర్ చిత్రాలకు ఇచ్చే ప్రతిష్టాత్మకమైన అవార్డును శివశంకరయ్య సొంతం చేసుకున్నారు. దారాన్ని ఎక్కడ మొదలుపెడితే అక్కడికే పూర్తయ్యేలా డా. అంబేద్కర్ చిత్రాన్ని ఎంతో నైపుణ్యంతో పూర్తిచేసి ఆయన అవార్డుకు ఎంపికయ్యారు. బహుముఖ ప్రజ్ఞావంతుడైన ఆయన ఇప్పటికే 4 డాక్టరేట్‌లు, 4, అంతర్జాతీయ అవార్డులు, 56 జాతీయ అవార్డులు కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా సూలుదారంతో డా.అంబేద్కర్ శిల్పాన్ని అత్యద్భుతంగా రూపొందించి ఆయన ఈ అరుదైన అవార్డుకు ఎంపిక కావడంతో, మండలంలోని ఉపాధ్యాయులు ఆయన్ను అభినందించారు.

లాయర్
మే 31, 2024

# ఆచరణకు రాని.. పర్యావరణ పరిరక్షణ

మనదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం నినాదంగానే ఉంటోంది తప్ప ఆచరణకు రావడం లేదు. అందరూ పర్యావరణం-పచ్చదనం ముఖ్యమని అంటుంటారే కానీ, ఎవరూ దానిపట్ల ఆశించిన స్థాయిలో శ్రద్ధ తీసుకోవడం లేదు. ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులు గమనిస్తూ, అందుకు తగినట్లుగా తగు చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఇప్పుడు కాదు, 1972లో స్వీడన్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి పర్యావరణ పరిరక్షణ సదస్సు స్పష్టం చేసింది. అందుకోసం 1973 నుంచి ప్రతి జూన్ 5వ తేదీని ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా నిర్వహించుకోవాలని, తద్వారా పర్యావరణ పట్ల మానవాళి అంతా అవగాహన కలిగించుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. మానవాళికే కాదు, సకల జీవరాశులకు ఆవాసమైనది ఒకే ఒక్కటి.. భూమి కనుక, నేలతల్లిని చల్లగా కాపాడుకోవడం ద్వారానే, పచ్చదనాన్ని-పరిశుభ్రతను పరిరక్షించుకోవడం, కాలుష్యాన్ని పూర్తిస్థాయిలో నివారించుకోవడం ద్వారానే మానవ మనుగడ సాధ్యమవుతుందని ఎంతోకాలంగా నిపుణులు పదేపదే హెచ్చరిస్తూనే ఉన్నారు. కానీ ఎవరు పట్టించుకుంటున్నారు గనక!.. నామమాత్రమైన చర్యలతో సరిపెట్టుకుంటున్నారే తప్ప ఆచరణలో పట్టించుకోవడం లేదు.. రానున్న విపత్తులను అసలు లక్ష్యపెట్టడం లేదు. అందులోనూ నేటి ఆధునికకాలంలో శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం అమితంగా పెరిగిపోవడం, ప్రపంచవ్యాప్తంగా అనేకరకాల పరిశ్రమలు కుప్పలుతెప్పలుగా పుట్టుకొస్తుండడంతో, వాటి నుంచి వచ్చే కాలుష్యంతో పాటు, భారీగా పెరిగే వాహన కాలుష్యం వగైరాలన్నీ అంతా ఇంతా కాదు. కార్బన్ మోనాక్సైడ్, కార్బన్‌డై ఆక్సైడ్ వంటి విషపూరిత వాయువులు వాతావరణంలో కలసిపోతుండడంతో పీల్చే గాలి, తాగే నీరు, తినే ఆహారం అన్నీ కలుషితమైపోతున్నాయి. మరోవైపు అడవులను నరికేస్తుండడం, ప్రకృతి సంపదను నాశనం చేస్తుండడం వంటి అమానుష చర్యలతో చేజేతులా లేనిపోని విపత్తులను కొనితెచ్చుకుంటున్నాం. వాతావరణ మార్పులతో జరిగే దుష్పరిణామాలు ఇప్పటికే మనం చూస్తూనే ఉన్నాం. గతంలో కంటే భూమి అగ్నిగుండంలా వేడెక్కిపోయి సెగలు కక్కుతోంది. ఎండాకాలం మండేకాలంగా మారిపోయింది. ఎప్పుడూ చూడని గరిష్ట ఉష్ణోగ్రతలను కూడా చవిచూడాల్సి వస్తోంది. రానున్న కాలంలో ఈ వేడి ఇంకా పెరిగిపోయే ప్రమాదం కూడా పొంచి ఉందని, దాంతో రానురాను మానవజీవనం దుర్భరంగా మారుతుందని నిపుణులు చెప్తూనే ఉన్నారు. అంతేకాదు, ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతల్లో వస్తున్న మార్పులవల్ల సముద్ర మట్టాలు కూడా పెరిగిపోతున్నాయని, అందువల్ల సముద్ర తీరప్రాంతాల్లో ఉన్న పట్టణాలు, నగరాలకు పెను ముప్పు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయని చెప్తున్నారు. వాతావరణ మార్పులతో తుఫాన్లు, వరద భీభత్సాలు పెరిగిపోతున్నాయని, భారీగా సముద్ర తీరాలు కోతకు గురవడం, దాంతో సమీపంలోనే ఉన్న ప్రాంతాలు జలమయమై చివరికి ఆవాసానికి నేల కూడా దొరకని దుస్థితి దాపురిస్తుందని చెప్తున్నారు. కర్బన ఉద్గారాలు పెరిగిపోయి భూతాపం పెరిగిపోతోందని ఎందరెన్ని హెచ్చరికలు చేస్తున్నా ఎవరూ ఖాతరు చేయడం లేదు. మనదేశంలో పరిస్థితి మరీ ఘోరం. ప్రకృతి సంపదను కొల్లగొట్టి అక్రమార్కులు ఏళ్ళ తరబడిగా కోట్లు కూడగట్టుకుంటున్నా పట్టించుకునే నాథులు లేరు. నేలతల్లికి ప్రాణప్రదమైన మట్టిని, ఇసుకను, కొండలను, బండలను, అడవులను, లోయలను, చెరువుల్ని దొరువుల్ని, నదుల్నీ ఒక్కటనేమిటి అన్నిరకాల ప్రకృతి వనరులనూ ఎవరికి వారు దోచుకుపోతున్నా ప్రభుత్వాలు చోద్యం చూస్తూనే ఉన్నాయి. దీంతో, రానురాను పర్యావరణం, పచ్చదనం, పరిశుభ్రత అన్నీ కేవలం నినాదాలుగా మారిపోతున్నాయే తప్ప, అవి ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ఆచరించాల్సిన విధానాలుగా మారడం లేదు. ఇకనైనా ప్రభుత్వాలు, ప్రజలు ప్రతిఒక్కరూ బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలి. ముఖ్యంగా, ప్రకృతిని నాశనం చేసి పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్న అక్రమార్కుల ఆటలు కట్టించేందుకు కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు తక్షణ కార్యాచరణ చేపట్టాలి. మనిషికి ప్రాణవాయువునిచ్చే చెట్లకు ప్రాణం పోయాలి. మానవునికి ఆవాసం కలిగించే నేలతల్లికి జీవం పోయాలి. కేవలం సభలు సమావేశాలతో చేతులు దులుపుకోక, ఎవరికి వారు పర్యావరణానికి, పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలి. తద్వారా, చల్లని ప్రశాంత వాతావరణం ఉండేలా మన ధరిత్రిని, మన ప్రకృతిని మనం కంటికి రెప్పలా కాపాడుకోవాలి. అప్పుడే ఇలాంటి పర్యావరణ దినోత్సవాలకి కూడా సార్ధకత ఉంటుంది.

**.... జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవం**

# దర్గామిట్ట రోడ్లు బాగుపడేదెప్పుడు?

నెల్లూరు నగరంలో దర్గామిట్ట ప్రాంతం ఇటీవలి కాలంలో బాగా అభివృద్ధి చెందుతోంది. కానీ ఎక్కడ చూసినా రోడ్లు గుంటలు పడిపోయి ఉన్నాయి. కరెంటాఫీస్ సెంటర్, పోస్టల్ కాలనీ, జడ్పీ కాలనీ, పొదలకూరు రోడ్డు, రాజరాజేశ్వరి గుడి ప్రాంతం ఇలా అనేకచోట్ల రోడ్లు పరమ అధ్వాన్నంగా ఉన్నాయి. వాహనాల రాకపోకలతో ఆ రోడ్లు మరింత దౌర్భాగ్యంగా తయారవుతున్నాయి. అయినా సంబంధిత అధికారులకు చీమకుట్టినట్లు కూడా ఉండడం లేదు. సర్దార్ వల్లబాయ్‌పటేల్ విగ్రహం వద్ద, ఏకే నగర్ పోస్టాఫీసు రోడ్డు, కరెంటీఫీస్ కూడలి వద్ద నుంచి ఉన్న పలు చీలు రోడ్లు, కాలనీలు, కూడళ్ళ వద్ద రోడ్లు మరింత అద్వాన్నంగా ఉంటున్నాయి. రాజరాజేశ్వరి అమ్మవారి గుడి వద్ద నుంచి అయ్యప్పగుడి వరకు ఉన్న ప్రధానరోడ్డు కూడా చాలాచోట్ల దెబ్బతిని ఉంది. వేదాయపాళెం వేదగణపతి ఆలయం ప్రాంతంలో రోడ్డు గుంటల మిట్టలుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు ఎంతో ఇబ్బందిగా ఉంది. రోడ్లు దెబ్బతిన్నచోట వెంటనే ప్యాచ్‌వర్క్‌లైనా చేయిస్తే కొంతలో కొంతైనా ఉపయోగంగా ఉంటుంది. జిల్లా ఉన్నతాధికారులైనా ఓసారి ఒక్క దర్గామిట్టలోనే కాదు, నగరంలోని అన్ని రోడ్లను పరిశీలించి వాటి బాగుకు చర్యలు చేపట్టాలని మనవి.

– ఇ. నాగరాజ్, **నెల్లూరు.**

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
WhatsApp +91 98663 14741

# ‘లాయర్’ కథనాలు బాగుంటున్నాయి

‘లాయర్’లో వారం వారం వస్తున్న పలు కథనాలు ఎంతో బాగుంటున్నాయి. వాస్తవాలకు అద్దం పట్టేలా ఉన్న అనేక కథనాలు, ముఖ్యంగా రాజకీయవార్తలు..విశ్లేషణలు పత్రికకే వన్నె తెస్తున్నాయి. మే 17న వచ్చిన సంచికలో ‘ముగిసిన యుద్ధం–ఫలితాలు సిద్ధం–జూన్ 4 వరకూ సందిగ్ధం’ వంటి ప్రాసలతో వచ్చిన కథనం పాఠకులకు బాగా నచ్చింది. చివరలో మీరు రాసినట్లు ‘ఆంధ్రా ఫలితాలు దేశ రాజకీయాలకే దిక్సూచి’ అవుతాయని మాకూ అనిపిస్తోంది. అది నిజం కూడా. ప్రజలు అభివృద్ధి, సంక్షేమం కావాలనుకుంటున్నారా? లేక పథకాల పేరుతో తమ ఖాతాల్లోకి వచ్చే పైసలు చాలనుకుంటున్నారా?..అన్న విషయం రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా కూడా చర్చగా ఉంటోంది. అదేవిధంగా మే 24 సంచికలో ‘ఫలితాలకు ముందే ప్రతీకారాలు’, ‘తీర్పు రాకముందే ఓర్పు కోల్పోయారు’ వంటి హెడ్డింగ్‌లతో నేటి రాజకీయాల్లో జరుగుతున్న హింసాత్మక సంఘటనల విశ్లేషణ మావంటి సామాన్య పాఠకులను కూడా చైతన్యవంతం చేసేదిగా, అందరినీ ఆలోచింపజేసేదిగా ఉంటోంది. మంచి విమర్శలు, విశ్లేషణలతో పాటు, ‘లాయర్’ ముఖచిత్ర పేజీలు ఆకర్షణీయంగా ఉంటున్నాయి. పేపర్ ముద్రణ క్వాలిటీతో పాటు, అందులోని సమాచారం కూడా మంచి క్వాలిటీతో ఉండడం అభినందనీయం!..

– షేక్ హుస్సేన్, **నెల్లూరు.**




# వైద్యరంగంలో మరణమృదంగం

## ■ ఆసుపత్రులలో ఆవిరవుతున్న అసువులు ■

సమాజంలో అత్యంత కీలకమైన వైద్య వ్యవస్థ మన దేశంలో అధ్వాన్నంగా తయారయ్యింది. అరాకొరా వసతులతో మన ఆసుపత్రులు రోగులపాలిట నరకకూపాలుగా మారిపోతున్నాయి. ప్రాణాలు పోయాల్సిన వైద్యశాలలే మృత్యుపాశాలుగా అవతరిస్తున్నాయి. అభం శుభం తెలియని పసివాళ్ల ఉసురు కూడా తీసేస్తున్నాయి. ఇటీవల దేశ రాజధాని ఢిల్లీలో ఓ చిన్నపిల్లల ఆసుపత్రిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో, పుట్టి నెలరోజులు కూడా కాని పసికూనలు మంటల్లో మలమలమాడిపోవడం ఘోరాతిఘోరం!.. అత్యంత దయనీయం!.. సరిగ్గా కళ్ళు తెరచి బాహ్యలోకాన్ని చూడని పసిబిడ్డలు మృత్యువు కోరల్లో చిక్కి శాశ్వతంగా కళ్ళు మూయడం దారుణాతి దారుణం!

ఏకంగా ఒకేసారి ఏడుగురు శిశువులు అగ్నికీలలకు ఆహుతైపోవడమే కాకుండా... మరో అయిదుగురు కాలిన గాయాలతో మృత్యువుతో పోరాడుతున్న పరిస్థితి వర్ణనాతీతం. కన్నబిడ్డలను పోగొట్టుకున్న తల్లుల గర్భశోకం, తండ్రుల మనోవేదన హృదయ విదారకం. షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయని, ఫలితంగా ఆక్సిజన్ సిలిండర్లు పేలిపోయాయని చెప్తున్నారు. ఆసుపత్రిలో అక్రమపద్ధతుల్లో ఆక్సిజన్ సిలిండర్లు రీఫిల్లింగ్ చేస్తుంటారని ఆ విషయంలో అక్కడి సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞానం కూడా అంతంతమాత్రమేనని ఇప్పుడు అంటున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా వుంది అక్కడ వారి నిర్వాకం. ప్రమాదం జరిగిన ఆసుపత్రికి అగ్నిమాపకశాఖ వారి నుంచి ఎన్‌ఓసీ (నో అబ్జక్షన్ సర్టిఫికెట్) కూడా లేకపోవడం ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. దేశవ్యాప్తంగా సంచలనమై ప్రజల మనసులను కకావికలం చేసిన ఇలాంటి ఘటనలు దేశంలో అప్పుడప్పుడూ జరుగుతూనే ఉన్నాయి. ఇంత జరుగుతున్నా ఆసుపత్రుల్లో భద్రత ఉందా లేదా అన్న విషయంపై దృష్టి పెట్టే నాథులే కనపడడం లేదు. గతంలో ఇలాంటి దుర్ఘటనలు చాలా సార్లు జరిగాయి. కరోనా సమయంలో ఆక్సిజన్ సరఫరా నిలిచిపోవడంతో ఒకేసారి చాలా ప్రాణాలు గాలిలో కలసిపోయాయి.

అలాంటి ఘోర సంఘటనలు జరిగినప్పుడైనా ప్రభుత్వ వ్యవస్థలు కళ్ళు తెరచి మళ్ళీ ఇలాంటి అమానుషాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుని ఉంటే ఇప్పుడు ఇంతటి ముప్పు ఏర్పడేది కాదు. ఏదైనా అనారోగ్యం ఏర్పడితే ఆసుపత్రులను ఆశ్రయిస్తాం. ప్రాణాపాయ పరిస్థితులలో వైద్యశాలలకి పరుగులు తీస్తాం. అలాంటిది ఆ హాస్పిటల్స్‌లోనే మృత్యువు రా... రమ్మని పిలిచే పరిస్థితులు ఉండడం దారుణం. బాధ్యత ఎవరిదైనా, తప్పు ఎవరు చేసినా అది క్షమించరాని నేరం.

### భద్రత లేని ఆసుపత్రులు బోలెడన్ని

ఒక్క ఢిల్లీలోని బేబీకేర్ ఆసుపత్రి మాత్రమే ఇలా ఉందా అంటే.. కాదు. దేశవ్యాప్తంగా భద్రత లేని ఇలాంటి ఆసుపత్రులెన్నో ఉన్నాయన్నది జగమెరిగిన సత్యం. అసలు నిబంధనల ప్రకారం ఆసుపత్రులు పెడుతున్నవారి సంఖ్య వేళ్లపైన లెక్కపెట్టవచ్చు. స్వార్థంతో, ధనార్జనే ప్రధానమన్న లక్ష్యంతో లోపభూయిష్టంగా ఆసుపత్రులను నిర్మిస్తున్నారు. అక్కడ ఉండే లోపాలు రోగుల పాలిట శాపాలుగా మారి వారి నిండుప్రాణాలను హరించేస్తున్నాయి. దేశంలో నిత్యం ఏదో ఒక చోట ఇలాంటి దారుణమైన సంఘటనలతో, ఆసుపత్రులు మరణ మృదంగం మోగిస్తూనే వున్నాయి. ఆసుపత్రులను ఎప్పటికప్పుడు తనిఖీలు చేసే వ్యవస్థలు, ప్రత్యేక యంత్రాంగం ఉన్నప్పటికీ అవి ఆసుపత్రుల యాజమాన్యాల చేతిలో కీలుబొమ్మలుగా మారి నిద్ర నటిస్తుంటాయి. కాసులకి కక్కుర్తి పడి యాజమాన్యాల అడుగులకి మడుగులొత్తు తుంటాయి. స్వార్ధం, స్వలాభమే ధ్యేయంగా ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో అనేకమంది వైద్యులు, వైద్యసిబ్బంది రోగుల్ని పీల్చి పిప్పిచేస్తున్నారు. రోగి దొరికితే చాలు.. డబ్బు డబ్బంటూ కాల్చుకు తినేసే ఎన్నో పైశాచికపు ఆసుపత్రులను కరోనా కాలంలో మనం చూశాం.

వైద్య సేవలందిస్తున్న వారందరూ ఇదే కోవకి చెందిన వారే అని కూడా మనం అనలేం. కొన్ని కార్పొరేట్ ఆసుపత్రులు రోగులకు అందించే వైద్యంతో పాటు వారి వసతులపై కూడా ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. రోగుల భద్రతే ప్రధానంగా తమ ప్రాంగణాలను తీర్చిదిద్దుతున్నాయి. దేశంలో దేవుళ్ళ లాంటి వైద్యులు ఎందరో ఉన్నారు. క్షణం కూడా విశ్రాంతి లేకుండా నిరంతరం రోగులకు ప్రాణం పోస్తూనే ఉన్నారు. కేవలం డబ్బు కోసం కాక, వైద్యంతో పదిమందినీ బతికించాలనే తపనతో, నిస్వార్ధంతో వైద్యసేవలందిస్తున్న వైద్య సారధులు దేశంలో దండిగానే ఉన్నారు. అలాంటివారు ఉండబట్టే ఈ కలికాలంలో కూడా సామాన్యులకు సైతం కొంత మంచి వైద్యం దొరుకుతోంది.

అయితే, ధనసంపాదనే ధ్యేయంగా ఆసుపత్రులు పెట్టి రకరకాల అక్రమాలకు పాల్పడేవారు కూడా వైద్యరంగంలో చేరిపోయి, ఆ పవిత్రమైన వృత్తికే కళంకం తెస్తున్నారు. ఇకనైనా పాలకులు, ప్రభుత్వాలు కళ్ళు తెరవాలి. వైద్యాలయాలంటే ప్రాణాలు పోసే దేవాలయాలుగా ఉండాలే తప్ప, కాసుల కోసం కక్కుర్తిపడే నీచ నికృష్ట కేంద్రాలుగా ఉండకూడదు. ఇప్పటికైనా రోగుల ప్రాణాలకు కట్టుదిట్టమైన భద్రతలు ఉండేవిధంగా, నియమనిబంధనలు ఖచ్చితంగా అమలయ్యే విధంగా ప్రభుత్వ పెద్దలు చూడాలి. ప్రమాదాలకు తావులేకుండా చేసే వ్యవస్థను రూపుదిద్దాలి. ముఖ్యంగా ఢిల్లీ లాంటి సంఘటనలు జరిగినప్పుడు అందుకు భాద్యులెవరో గుర్తించి వారు ఎంతటి వారైనా, కఠినంగా శిక్షించాలి. అప్పుడే వైద్యరంగాన్ని మానవీయతకు మారుపేరుగా తీర్చిదిద్దుకోగలం!

- రాజశ్రీ

# వీరాంజనేయస్వామికి.. లక్ష మల్లెల పూజ



హనుమజ్జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని కోవూరులో కొలువైవున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 29న వేడుకగా లక్ష మల్లెల పూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో, అర్చకులు సుబ్బయ్యస్వామి, నంద కుమారస్వామి ప్రత్యేకపూజలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరునికి ఆభరణాల వితరణ

పొదలకూరులోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా, ఈనెల 29న పొదలకూరుకు చెందిన భక్తులు మలిశెట్టి శివకుమార్-లావణ్య దంపతులు స్వామివారి మూలవిరాట్‌కు ఆరున్నర లక్షల రూపాయల విలువచేసే బంగారు ఆభరణాలను అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు పెండ్యాల రమణయ్యనాయుడుకు వాటిని అందజేయగా, అర్చకులు దాతలను ఆశీర్వదించి, ఆ ఆభరణాలను స్వామివారికి అలంకరించారు.

# సేంద్రీయ ఉత్పత్తులే ఎంతో శ్రేయస్కరం


## మాగుంట లే అవుట్‌లో ఆకట్టుకున్న పండ్ల ప్రదర్శన



వృక్ష ఆయుర్వేద పద్ధతుల్లో రైతు అల్లూరు రాధాకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పండించిన ఉత్పత్తుల ప్రదర్శనను ఈనెల 29న నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని పిచ్చిరెడ్డి కళ్యాణమండపం వద్ద ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను కార్డి యాలజిస్ట్ శ్రీనివాసరాజు ప్రారంభించి మాట్లాడుతూ, పురుగుమందులతో కాకుండా ప్రకృతి సహజమైన పద్ధతులు, సేంద్రీయ సాగు విధానాల ద్వారా పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు. ఈ ప్రదర్శనలో సేంద్రీయ పద్ధతుల్లో పండించిన మామిడిపండ్లు, గానుగతో ఆడించిన నువ్వుల నూనెలు, ముడి పెసర, కందిపప్పు వగైరాలను ఉంచారు. మార్విన్ ఇన్వెంట్ అనే సంస్థ వారు రైతు రాధాకృష్ణారెడ్డికి ఉత్తమరైతు పురస్కారం అందజేశారు.

# నింగిలోకి దూసుకుపోయిన 'అగ్నిబాణ్'

## ● తొలి ప్రైవేట్ రాకెట్ విజయవంతం



ప్రపంచ స్థాయిలో అంతరిక్ష మార్కెట్‌ను ఒడిసిపట్టేలా భారత్ మరో కీలక ముందడుగు వేసింది. ప్రత్యేకశ్రేణి ఉప గ్రహాలను కారుచౌకగా కక్ష్యలోకి ప్రవేశ పెట్టేందుకు శ్రీహరికోట నుంచి ఎక్కుపెట్టిన తొలి ప్రైవేట్ రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకుపోయింది. ఇది దేశంలోనే మొదటి సెమీక్రయోజెనిక్ ఇంజన్ ఆధారిత రాకెట్ కావడం విశేషం!


చెన్నై ఐఐటి కేంద్రంగా పనిచేసే అగ్నికుల్ సంస్థ 'అగ్నిబాణ్' పేరిట తొలి సారిగా ఈ ప్రయోగాన్ని మే 30వ తేదీ గురువారం ఉదయం 7.10 గంటల సమయంలో ప్రయోగించినట్లు ఇస్రో తెలిపింది. వాస్తవానికి ఈ ప్రయోగం 45రోజుల క్రితమే జరిగి ఉండాల్సింది. కానీ, పలు కారణాలతో వాయిదా పడుతూ నేటికి ద్విగ్విజయంగా జరిగింది. శ్రీహరికోటలోని తొలి ప్రైవేట్ లాంచ్ ప్యాడ్ ఏఎల్‌పి-01 వేదికగా సింగిల్ స్టేజీలో రెండు నిమిషాలు మాత్రమే జరిగిన ఈ ప్రయోగాత్మక ప్రయోగం ముగిసి, శాస్త్రవేత్తలు నిర్దేశించిన విధంగా సముద్రంలో పడింది. ప్రపంచంలోనే తొలిసారిగా సింగిల్ పీస్ త్రీడీ ప్రింటెడ్ సెమీ క్రయోజెనిక్ ఇంజిన్‌ను ఇందులో అమర్చడం మరో విశేషం! ఈ ప్రయోగం విజయవంతం కావడంతో ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ 'అగ్నికుల్ కాస్మోస్ సంస్థ'ను అభినందించారు.

# సీనియర్ సిటిజన్‌లకు.. టీటీడీ శుభవార్త

## శ్రీవారి ఉచిత దర్శనం కోసం రెండు స్లాట్లు.. అర్ధగంటలోనే స్వామివారి దర్శనం

కలియుగ ప్రత్యక్షదైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దర్శించుకోవాలనే సీనియర్ సిటిజన్‌లకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు తాజాగా శుభవార్త చెప్పున్నారు. శ్రీవారి ఉచిత దర్శనం కోసం రెండు స్లాట్లు ఏర్పాటుచేశామని, ఒకటి ఉదయం 10 గంటలకు, మరొకటి మధ్యాహ్నం 3 గంటలకు ఉంటుందని తెలిపారు. ఫోటో, ఐడీతో వయస్సుకు సంబంధించిన రుజువును ఎస్-1 కౌంటర్‌లో సమర్పించాలని, ఏ మెట్లూ ఎక్కాల్సిన అవసరం లేకుండా వంతెన కింద గ్యాలరీ నుంచ ఆలయం కుడివైపు గోడకు రోడ్డు దాటుతుందని, మంచి సీటింగ్ ఏర్పాటు కూడా ఉందని పేర్కొన్నారు. లోపల కూర్చున్నప్పుడు వేడి సాంబార్ అన్నం, పెరుగన్నం, వేడి పాలు అన్నీ ఉచితంగా టీటీడీ అందజేస్తుందని, 20 రూపాయలు చెల్లిస్తే రెండు లడ్డూలు పొందవచ్చని, ఇంకా లడ్డూలు కావాలంటే ప్రతి లడ్డూకి 25 రూపాయలు చెల్లించాలని పేర్కొన్నారు. ఆలయం ఎగ్జిట్ గేట్ వద్ద ఉన్న కారు పార్కింగ్ ప్రాంతం నుంచి కౌంటర్ వద్దకు చేరేందుకు బ్యాటరీ కారు అందుబాటులో ఉంటుందన్నారు. దర్శనం సమయంలో అన్ని ఇతర క్యూలు నిలిపివేస్తామని, ఎటువంటి వత్తిడి లేకుండా కేవలం సీనియర్ సిటిజన్‌లకు మాత్రమే శ్రీవారి దర్శనానికి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. కేవలం 30 నిమిషాల్లోనే స్వామివారిని దర్శించుకుని రావచ్చని పేర్కొన్నారు. వివరాలకు హెల్ప్ డెస్క్ 08772 277777 నెంబరును సంప్రదించాని సూచించారు.

# 'జ్ఞానశ్రీ'..మధుర రాగాల 'గానశ్రీ'



*జ్ఞానశ్రీ అంటే మామూలు జ్ఞానశ్రీ కాదు..మధుర రాగాల గానశ్రీయే అనాలి. తియ్యని కంఠస్వరం, రాగ తాళ జ్ఞానంతో శృతిపక్వమైన గానం ఆమెకు వరాలు. ఏ పాట పాడినా, అది లలిత సంగీతమైనా, శాస్త్రీయ సంగీతమైనా, అన్నమయ్య సంకీర్తనయినా..ఆమె గొంతులోనే వినాలన్నంతా మధురంగా ఉంటాయి. సంగీతంపై ఆరాధనతో, ఆ కళలో రాణించాలనే తపనతో, నిరంతర సాధనతో జ్ఞానశ్రీ ఎంతగానో కృషిచేస్తోంది. కమ్మని రాగాల కోయిలమ్మలా పాటలు పాడుతూ పాటల కచ్చేరీల్లో, సంగీత విభావరుల్లో తనదంటూ ప్రత్యేకతను చాటుకుంటోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో సంగీత కార్యక్రమాల్లో అద్భుతంగా గానం చేస్తూ, అందరికీ వీనుల విందు చేస్తోంది. ఎస్వీబీజీ కార్యక్రమాల్లోనూ, ఈటీవీలో 'పాడుతా తీయగా'లో కూడా జ్ఞానశ్రీ తన మనోహర గానంతో అందరి కరతాళధ్వనులందుకుంది.*

నెల్లూరు నగరంలోని మనుమసిద్ధినగర్‌కు చెందిన జ్ఞానశ్రీ పూర్తిపేరు.. ఇందుర్తి వెంకట నాగసాయి జ్ఞానశ్రీ. తల్లి పేరు వెంకట ధాన్యలక్ష్మి, తండ్రి విద్యుత్‌శాఖ ఉద్యోగి ఆదిశేషగిరిరావు. జ్ఞానశ్రీ ప్రస్తుతం నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదువుతోంది. చిన్నతనం నుంచి పాటలు, సంగీతం పట్ల తమ కుమార్తెకు ఉన్న ఆసక్తిని గమనించిన తల్లితండ్రులు జ్ఞానశ్రీని మంచి సంగీత గురువుల వద్ద శిక్షణకు చేర్పారు. 2009లో నెల్లూరులోని ప్రముఖ సంగీత విద్వాంసురాలు పి.దేవసేన వద్ద కర్నాటక సంగీతంలో శిక్షణ తీసుకుంది. ఆ తర్వాత కలైమణి ఏ.లక్ష్మీప్రసన్న వద్ద శిక్షణ తీసుకుంటూ, ఆమె ఆధ్వర్యంలోనే ఆరంగేట్రం చేసి అనేక దేవాలయాల్లో జరిగే సంగీత కచేరీల్లో పాల్గొని అందరి ప్రశంసలు అందుకుంది. ఆమెతో పాటు వారి గురువైన కలైమామణి ఎస్.రాజేశ్వరి (చెన్నై) వద్ద కూడా జ్ఞానశ్రీ నేటికీ శిక్షణ పొందుతోంది. 2017లో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్శిటీలో కర్నాటక సంగీతంలో సర్టిఫికెట్ కోర్సు అభ్యసించి, ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలైంది. 2010లో డిప్లొమాలో కూడా డిస్టింక్షన్ సాధించింది. ఇటీవల ప్రముఖ సినీ నేపథ్యగాయకుడు హేమచంద్ర సోదరి, ప్రముఖ లలితసంగీత కళాకారిణి అయిన హిమబిందు (హైదరాబాద్) వద్ద లలిత సంగీతంలో మెళకువలు నేర్చుకుంది. అదేవిధంగా, ప్రముఖ సినీ నేపథ్యగాయకుడు నేమాని పార్థసారథి వద్ద పోతన భాగవతంలోని పద్యాలను సాధన చేసింది.

## ఎన్నెన్నో బహుమతులు :

చెన్నైలోని పలు ప్రముఖ సంస్థల వారు నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో ప్రథమ విజేతగా నిలిచిన జ్ఞానశ్రీ, 'ఇండియన్ రాగా' వారు అంతర్జాతీయస్థాయిలో నిర్వహించిన సంగీత పోటీల్లో (కర్నాటక సంగీతం) కూడా 'ఆనందనర్తన గణపతిమ్ భావయే' అంటూ భక్తిరసస్ఫోరకంగా గానం చేసి విజేతగా నిలవడం మరో విశేషం. అంతర్జాతీయ స్థాయిలో ఐబీఏఎం వారు నిర్వహించిన శ్రీ పోతన భాగవతంలోని పద్యాల పోటీల్లో ప్రథమ బహుమతిని అందుకుని పోతన పద్యాలను హృద్యంగా పాడడంలో తనకెవరూ సాటిలేదనిపించుకుంది. హైదరాబాద్‌లో శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర ఆరాధ్య జనసేవావాహిని ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అంతర్‌రాష్ట్రీయ పోటీల్లో ద్వితీయ బహుమతిని సాధించింది.

నగరంలోని కళాంజలి సంస్థ నిర్వహించే అనేక సంగీత కార్యక్రమాల్లో పాల్గొని ప్రముఖ గాయనీ గాయకులు ఎస్పీ చరణ్, ఎస్పీ శైలజలతో పాటు గొల్లపూడి మారుతీరావు, సుద్దాల అశోక్‌తేజ, వెన్నెల కంటి, శుభలేఖ సుధాకర్ వంటి ప్రముఖుల అభినందనలు అందుకుంది. ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ వారు నిర్వహించిన పలు కార్యక్రమాల్లోనూ పాల్గొని ప్రముఖ నిర్మాత ఏఎం రత్నం నుంచి సన్మానం అందుకుంది. తెలుగు అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి నుంచి ఆశీస్సులందుకుంది. హైదరాబాద్‌లో మాడుగుల నాగఫణిశర్మ ఆధ్వర్యంలోని అవధాన సరస్వతి పీఠంలో పంచరత్న గోష్టి గానం చేసి జ్ఞానశ్రీ సంగీతరంగంలో తన ప్రజ్ఞాపాటవాలను చాటుకుంది. సంగీతంలోనే కాక, చదువులోనూ రాణిస్తూ, దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహిస్తున్న కోర్సులను కూడా అభ్యసించి, ప్రాథమిక నుంచి ప్రవీణ వరకూ ఉత్తీర్ణురాలైంది. అపారమైన కృషి, పట్టుదలతో నిరంతర సాధన చేస్తూ, మరింతగా మెళకువలు నేర్చుకుని సంగీత రంగంలో సమున్నతంగా రాణించాలన్న సంకల్పంతో ఉన్న నెల్లూరు గానాల బిడ్డ..జ్ఞానశ్రీ తన లక్ష్యాలను సాధించి జిల్లా ఖ్యాతిని మరింతగా ఇనుమడింప జేయాలని ఆశిద్దాం!...

## ఈటీవీ.. ఎస్వీబీసీల్లోనూ ప్రశంసలు



2010లో అన్నమయ్య జయంతోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన అఖండ సహస్ర సంకీర్తనార్చనలో పాల్గొంది. సిలికానాంధ్ర వారిచే నిర్వహించబడిన ఈ కార్యక్రమం అప్పట్లో గిన్నిస్‌బుక్‌లో కూడా చోటుచేసుకోవడం విశేషం. 2022లో శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ (ఎస్‌విబిసి)లో ప్రసారం చేస్తున్న అన్నమయ్య సంకీర్తనలకు సంబంధించి 'అదివో అల్లదివో' కార్యక్రమంలో జ్ఞానశ్రీ పాల్గొంది. అదేవిధంగా, వర్ధమాన సంగీతకారులను ప్రోత్సహిస్తూ ఈటీవీలో 2023లో జరిగిన 'పాడుతా తీయగా' కార్యక్రమంలో పాల్గొని నెల్లూరు పేరును మారుమ్రోగించింది. 2014లో నెల్లూరులోని 'కళాంజలి' సాంస్కృతిక సంస్థ నిర్వహిస్తున్న సినీసంగీత కచేరీల్లో గాయనిగా స్థానం సంపాదించుకుని, సినీపాటల ప్రస్థానాన్ని ప్రారంభించింది. కళాంజలి అనంత్, శర్మల ప్రోత్సాహంతో అనేక సంగీత కార్యక్రమాల్లో పాల్గొని తీయని గొంతుతో పాటల పతాకం ఎగరేస్తోంది.

### శబరి శ్రీరామక్షేత్రంలో..

# హనుమజ్జయంతి వేడుకలు



జూన్ 1న హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలోని శబరి శ్రీరామక్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామికి ఈనెల 26న ప్రత్యేకపూజలు చేసి, హనుమజ్జయంతి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మందిరంలో కొలువైవున్న శ్రీ సీతారాములు, శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వార్లకు ఆలయ అర్చకులు కన్నులపండువగా అలంకారాలు నిర్వహించారు. విజయవాడలోని హనుమత్ దీక్షాపీఠం భక్తబృందం 29వ తేది సాయంత్రం 6 గంటల వరకు 72 గంటల పాటు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం ప్రారంభించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొని స్వామివార్లను దర్శించుకుంటున్నారు.

# కళాకారులకు ఎన్టీఆర్ ఆదర్శం

### కళాంజలి అనంత్



ఎన్టీఆర్ కళామతల్లి ముద్దుబిడ్డ అని, నటనను ఒక తపస్సుగా భావించి, తన అద్భుతమైన నటనా చాతుర్యంతో సినీరంగంలో విశ్వవిఖ్యాతి చెందారని, నాటితరం వారికి నేటితరం వారికే కాక భావితరాల కళ కారులందరికీ కూడా ఆయన మార్గదర్శకమని ఏపీ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ నెల్లూరు డివిజన్ కోఆర్డినేటర్ కళాంజలి అనంత్ అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నెల్లూరులో అనంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అనేకమంది రంగస్థల, సినీ కళాకారులు పాల్గొని ఎన్టీఆర్ కళారంగానికి చేసిన సేవలను తలచుకుంటూ ఘనంగా నివాళులర్పిం చారు. ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని కళాకారులకు వారు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, నెల్లూరుకు చెందిన ప్రముఖ రంగస్థల నటుడు ఏడుకొండలయాదవ్‌ను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాకారులు దువ్వూరు బెనర్జీ, మురళి, నిర్మాతలు శైలజ, మల్లికార్జున్, సినీ నటి రూప, 'పాడుతా తీయగా' గాయని జ్ఞానశ్రీ, నలుబోలు బలరామయ్యనాయుడు, రమణారెడ్డి, ఎన్. సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రంగా లేని దుకాణాలకు జరిమానాలు



నెల్లూరు నగరంలోని ఆహార విక్రయ దుకాణాల్లో పరిశుభ్రతను తప్పకుండా పాటించాలని, లేకుంటే జరిమానాలు తప్పవని ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటరమణ దుకాణదారులను హెచ్చరించారు. ఈనెల 28న ఆయన చిల్డ్రన్స్‌పార్కు సమీపంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, పరిశుభ్రత పాటించని దుకాణాలకు రూ. 10వేల జరిమానా విధించారు.

# నెల్లూరు కబుర్లు

# అల్లర్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు

### డీఎస్పీల హెచ్చరిక



సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎవరైనా అల్లర్లకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి హెచ్చరించారు. ఈనెల 28న వారు నెల్లూరులోని నగర డిఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ, కౌంటింగ్‌రోజైన జూన్ 4న తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను వివరించారు. ప్రజలు గుంపులుగా రోడ్లపై తిరగకూడదని, గొడవలకు దిగకూడదని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం నిర్దేశించిన నియమ నిబంధనలు పాటించా లన్నారు. పోలీసుల హెచ్చరికలను అతిక్రమించి ఘర్షణలకు దిగితే రౌడీషీట్లు తెరుస్తామన్నారు. ప్రశాంతంగా ఓట్ల లెక్కింపు జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ డీఎస్పీ హేమలత తదితరులు పాల్గొన్నారు.

# జయభారత్‌లో రోగులకు అన్నప్రసాదం



ఎస్‌బిఐ విశ్రాంత ఉద్యోగులు కొందరు ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు సేవా సంఘం ద్వారా నగరంలోని జయభారత్ హాస్పిటల్ ప్రాంగణంలో అన్న ప్రసాదం వితరణ గావించారు. ఆసుపత్రిలో ఉన్న రోగులకు, వారి సహాయకులకు ప్రతిరోజూ వారు సేవాభావంతో భోజనం అంద జేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎస్‌బిఐ విశ్రాంత ఉద్యోగులైన వరదరాజు, పూర్ణచంద్రరావు మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ తరువాత స్నేహితులతో కలసి అన్నదానం కార్యక్రమం చేయాలని భావించామని, ఒక రోజుకు ఆ కార్యక్రమానికి సుమారు 3800 రూపాయలు ఖర్చవు తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అనేక మంది దాతలు ముందుకు వచ్చి సహకరిస్తున్నారని, ఎవరైనా వారి జన్మదినం సందర్భంగా కానీ, వారి పెద్దల జ్ఞాపకార్థం కానీ ఈ కార్యక్రమానికి తగు సాయం చేయవచ్చ న్నారు. దాతల పేరు బోర్డులో రాయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కొండపల్లి శ్రీధర్, మునగా సుబ్బారావు తదితరులు పాల్గొంటున్నారని, ఇటీవల శ్రీమతి నిహితరెడ్డి జన్మదినం సందర్భంగా ఆమె భర్త రాఘవరెడ్డి పాల్గొని రోగులకు అన్నప్రసాద వితరణ గావించారని పేర్కొన్నారు.

# యుగపురుషుడు..ఎన్టీఆర్

### జయంతి కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు



పేదల అభ్యున్నతి కోసం పరితపించిన దివంగత మహానేత ఎన్టీఆర్ యుగపురుషుడని టీడీపీ నాయకులు కీర్తించారు. ఈనెల 28న ఎన్టీఆర్ జయంతి సందర్భంగా నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో నాయకులు అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఎన్టీఆర్ కారణజన్ముడని అంటూ, పేద, బడుగు వర్గాల ప్రజలకు ఆయన చేసిన సంస్కరణలు చిరస్మర ణీయమని కొనియాడారు. తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, నెల్లూరు నగర నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి పొంగూరు నారాయణ, మాజీమంత్రి తాళ్ళపాక రమేష్‌రెడ్డి, నాయకులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాలేపాటి సుబ్బానాయుడు, మునిసిపల్ మాజీ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మామిడాల మధు, కంభం విజయరామిరెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొని కేకును కట్‌చేసి అందరికీ తినిపించారు.

# 'నారాయణ'లో నైపుణ్యాభివృద్ధి కేంద్రం




నెల్లూరులోని నారాయణ ఇంజనీరింగ్ కాలేజీలో ఇటీవల ఆ కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ తదితరుల ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన కోడింగ్ కాంపిటేషన్‌లో నారాయణ విద్యార్థులు ప్రతిభ చూపారని అంటూ, ఈ సందర్భంగా వారందరిని ఆయన అభినందించారు. రానున్న రోజుల్లో విద్యార్థులందరూ ఉన్నత స్థాయికి చేరాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుమారు ఆరువందల మందితో ఎన్నికల ముందు మహిళా విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, వీరంతా ఎన్నికల్లో చాలా కష్టపడి పనిచేశారని తెలిపారు. మహిళా శక్తి సభ్యులకి ఏ రంగంలో అభిలాష ఉందో ఆ రంగంలోనే వారికి స్కిల్‌డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుం దన్నారు. ఇలా వారికి ఐటీ ఉద్యోగాలు కానీ... హాస్పిటల్స్‌లో కానీ ఇతరత్రా ఎక్కడైనా ఉద్యోగాలు వచ్చే విధంగా చేస్తానని ఎన్నికలకు ముందే తాను చెప్పానని, ఇప్పటినుంచే 30మందితో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఒక బ్యాచ్, సాయంత్రం 3 గంటల నుంచి 7 గంటల వరకు ఇంకో బ్యాచ్‌కి ప్రాథమిక విషయాలు చెప్పే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు.




# మహోన్నత నేత..ఎన్టీఆర్

తెలుగువారి కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటిన మహోన్నత నేత ఎన్టీ రామారావు అని పలువురు వక్తలు ప్రశంసించారు.. నెల్లూరులోని కేత అంకుల్ మెమోరియల్ ట్రస్ట్, గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా స్థానిక స్వతంత్రపార్క్‌లో ఈనెల నిర్వహించిన ఎన్టీఆర్ జయంతి కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు పాల్గొని ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి... ఆయన సేవలను తలుచుకుంటూ నివాళులర్పించారు. మండల వ్యవస్థను ఏర్పాటు చేసి బడుగు, బలహీనవర్గాలకు రిజర్వేషన్ కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. రెండు రూపాయల కిలో బియ్యం పథకం వంటి సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకున్నారన్నారు.



తెలుగుజాతి ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ ప్రతీక అన్నారు. ఈ కార్యక్రమంలో గౌతమ్ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవ రాయప్ప, కేత సుబ్బారావు, సింగంశెట్టి మురళీమోహన్‌రావు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి జయప్రకాష్‌తో పాటు ప్రముఖ కళాకారులు, వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తల సంక్షేమం కోసం.. ఏటా రూ.10 కోట్లు వెచ్చిస్తా

## సొంతనిధులతో వారికి చేయూతనందిస్తానన్న నారాయణ



తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలు పునాదులని, పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని నిస్వార్థంగా విజయవంతం చేసే త్యాగధనులు కార్యకర్తలేనని, అలాంటి కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తన సొంతనిధులతో ఏటా 10కోట్ల రూపాయలు వెచ్చించి వారి సంక్షేమానికి కృషి చేస్తానని నెల్లూరు నగర నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి..మాజీమంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. ఇటీవల ఆయన విడుదల చేసిన ప్రకటనలో కార్యకర్తల పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం జిల్లాలో తొలిసారిగా నారాయణ చేపడుతున్న ఈ కార్యక్రమం ఆ పార్టీలో సంతోషం వెల్లువెత్తుతోంది. పార్టీ జెండాను మోస్తూ...పార్టీకి బలం చేకూర్చేది కార్యకర్తలేనని, వారు బాగుండాలని తన అభిలాష అని నారాయణ తన ఆకాంక్షను వెల్లడించారు. తెలుగుదేశం పార్టీకి తొలినుంచి పటిష్టమైన కేడర్ ఉందన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆలోచనలతో కార్యకర్తలకు బీమా పథకాన్ని తీసుకువచ్చారని, అందులో చేరినవారు విధివశాత్తూ మృతి చెందితే వారి కుటుంబాలకు 2 లక్షలు రూపాయలు అందజేస్తున్నారని, ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో సుమారు 5 లక్షల మందికి పైగానే కార్యకర్తలకు ఈ బీమా సౌకర్యాన్ని అందిస్తున్నారని ఆయన తెలిపారు. కార్యకర్తలకు తనవంతు సేవలో భాగంగా, ఏటా తన కుటుంబ సంపాదనలో పది కోట్ల రూపాయలను కార్యకర్తల సంక్షేమ నిధికి డిపాజిట్ చేయాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. ఆ పది కోట్ల రూపాయలు పూర్తిగా కార్యకర్తల సంక్షేమానికే ఖర్చు చేస్తామని.. అందుకు, ముందుగా కార్యకర్తలకు గుర్తింపు కార్డులు అందిస్తారని వెల్లడించారు. కార్యకర్తల కుటుంబాల్లో ఆర్థిక ఇబ్బంది ఏర్పడితే... ఆ మేరకు సంక్షేమ నిధి నుంచి వారికి సాయం చేస్తారని, ఇదే కాకుండా కార్యకర్తల పిల్లల చదువులకు, పెళ్లిలకు ఆర్థిక సాయం అందించాలని ఆలోచన చేస్తున్నామన్నారు. దీనిని పటిష్టంగా అమలు చేసి మంచి ఫలితాలు వస్తే పార్టీ పరంగా మరి కొన్ని నియోజకవర్గాల్లో కూడా ఇదే విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు. దీంతో తెలుగుదేశం పార్టీకి ఇదో శుభపరిణామమంటూ టీడీపీ కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రామ్ ఆధ్వర్యంలో ఏజెంట్లకు అవగాహన



వైకాపా వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 29న కౌంటింగ్ ఏజెంట్లకు తగు జాగ్రత్తలు సూచించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న జరుగనున్న దృష్ట్యా, తమ పార్టీ తరఫున ఏజెంట్లుగా హాజరుకానున్న నాయకులకు వెంకటగిరిలోని నేదురుమల్లి నివాసంలో ఏజెంట్ల విధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

## 'లయన్స్‌క్లబ్' ఆధ్వర్యంలో

# కంటి ఆపరేషన్లు

లయన్స్ క్లబ్ - నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఈనెల 27న కలువాయిలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించి, 150 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులిచ్చారు. ఇక్కడ పరీక్షలు చేయించుకున్నవారిలో ఆరుగురికి నెల్లూరులోని పిఎల్‌రావు ఆసుపత్రిలో శస్త్రచికిత్సలు చేయించారు. మోడరన్ ఐ హాస్పిటల్, నారాయణ డెంటల్ కాలేజీ, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. పలువురు దాతలు కూడా ఈ సేవా కార్యక్రమానికి సహకరించారు.


# శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో.. అన్నమయ్య సంకీర్తనా గానాలు

## • వర్ధమాన సంగీతకారులతో శ్రీవారికి సంగీతార్చన





'బ్రహ్మ కడిగిన పాదము', 'ముద్దుగారే యశోద', 'కొండలలో నెలకొన్న కోనేటిరాయడు'..వంటి అన్నమయ్య రచించిన మధుర సంకీర్తనా గానాలతో నెల్లూరు మాగుంట లేఅవుట్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణం పులకించిపోయింది. చిన్నారులు, విద్యార్థులైన గాన కళాకారులు వందమందికి పైగానే అన్నమయ్య సంకీర్తనలను భక్తిశ్రద్ధలతో వీనులవిందుగా ఆలపిస్తుంటే ఆలయానికి వచ్చిన భక్తజనులంతా పరవశించిపోయారు. పదకవితా పితామహుడు, తొట్టతొలి తెలుగు వాగ్గేయకారుడు, శ్రీ వేంకటేశ్వరునిపై అనన్యభక్తితో వేలాది సంకీర్తనా సుమాలతో శ్రీవారిని అర్చించిన భక్తకవి శ్రీమాన్ తాళ్లపాక అన్నమాచార్యుల వారి 616వ జయంతిని పురస్కరించుకుని నెల్లూరులోని శ్రీ గురుకృప సంగీత విద్యాలయం అధినేత్రి లక్ష్మీప్రసన్న, భారతి సంగీత విద్యాలయం నిర్వాహకురాలు రమాదేవిల నేతృత్వంలో ఈనెల 25న జరిగిన సంగీత విభావరి అందరినీ అలరించింది. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత వర్ధమాన కళాకారులతో కలిసి నగర సంకీర్తన చేస్తూ శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి దాదాపు రెండున్నర గంటల సేపు చిన్నారులు, విద్యార్థులు, వర్ధమాన గాన కళాకారులు పాల్గొని అన్నమయ్య సంకీర్తనలను హృద్యంగా గానం చేశారు. వయోలిన్ విద్వాంసులు రావిప్రోలు సుబ్రహ్మణ్యం, శాంతి కళాధర్ మృదంగ వాద్య సహకారంతో, ఆలయ నిర్వాహకుల ప్రోత్సాహంతో ఈ సంకీర్తనల గానాలు ఆద్యంతం అందరినీ అలరించాయి. భిక్షాటనాపూర్వక శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాల సభ కార్యదర్శి డా.వై నాగదేవిప్రసాద్, కళాంజలి అనంత్, నలుబోలు బలరామయ్యనాయుడు, దోర్నాల హరిబాబు, ఎంపి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీసిటీలో మరో కొత్త పరిశ్రమ

## రష్యాకి చెందిన తొలి భారతీయ ఉత్పత్తి కేంద్రం ప్రారంభం

***అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన శ్రీసిటీలో ప్రపంచవ్యాప్తంగా అనేకదేశాలకు చెందిన పరిశ్రమలు కొలువుతీరివున్న నేపథ్యంలో తాజాగా రష్యా కంపెనీ కూడా వచ్చి చేరడంతో శ్రీసిటీ పారిశ్రామికవర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోంది. రష్యాకు చెందిన ప్రముఖ కుయిబిషెవ్ అజోట్ పిజెఎస్‌సి అనుబంధ సంస్థ కుయిబిషెవ్ అజోట్ ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నూతన పరిశ్రమ ఈనెల 29వ తేదీ బుధవారం శ్రీసిటీలో ప్రారంభం కావడం విశేషం.***

అత్యాధునిక సదుపాయాలతో రూ.95 కోట్ల ప్రారంభ పెట్టుబడితో 3 ఎకరాల్లో ఈ ప్లాంట్‌ను నిర్మించారు. 15 వేల టన్నుల ప్రారంభ వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపుచేసే ప్రణాళికలతో నెలకొల్పిన ఈ ప్లాంట్ ద్వారా మహీంద్రా, మారుతీ సుజుకీ వంటి అగ్రశ్రేణి ఆటోమోటివ్ తయారీ పరిశ్రమలు, సిమెన్స్, ష్నీడర్, గోద్రెజ్ వంటి ఎలక్ట్రిక్ పరిశ్రమలు, భారతీయ రైల్వేలు, రక్షణ రంగాలలోని కీలక సంస్థలతో సహా పలు ప్రతిష్టాత్మకమైన ఖాతాదారులకు సేవలు అందించనుంది. రష్యా, జర్మనీ, చైనాలో ఉత్పత్తి సదుపాయాలను కలిగివున్న కుయిబిషెవ్ అజోట్, అభివృద్ధి చెందుతున్న భారతీయ మార్కెట్‌లో తన స్థానాన్ని కొనసాగించే లక్ష్యంగా వ్యూహాత్మకంగా ప్లాంట్ ఏర్పాటు చేసింది. చెన్నైలోని రష్యన్ కాన్సుల్ జనరల్ ఒలేగ్ ఎన్ అవదీవ్ చేతులమీదుగా దీనిని ప్రారంభించగా, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కుయిబిషెవ్ అజోట్ (శ్రీసిటీ) మేనేజింగ్ డైరెక్టర్ అలెగ్జాండర్ గెరాసిమెంకో, డైరెక్టర్ పి.బి.రమేష్, కుయిబిషెవ్ అజోట్ పిజెఎస్‌సి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవదీవ్ మాట్లాడుతూ, 2019లో తన శ్రీసిటీ సందర్శనను గుర్తుచేసుకున్నారు. శ్రీసిటీ పారిశ్రామిక నగరం ప్రత్యేకతలు, వ్యాపారానుకూల వాతావరణం అద్భుతమంటూ కొనియాడారు. శ్రీసిటీలో ప్లాంట్ ఏర్పాటు చేయాలనే కుయిబిషెవ్ అజోట్ నిర్ణయాన్ని స్వాగతించిన ఆయన, కంపెనీ ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

### శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి హర్షం

రష్యన్ కాన్సుల్ జనరల్‌ను స్వాగతించిన డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, కుయిబిషెవ్ అజోట్ ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ సంస్థ శ్రీసిటీ పారిశ్రామిక కుటుంబంలో చేరడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఇది మొదటి రష్యన్ కంపెనీగా పేర్కొన్న ఆయన, కాన్సుల్ జనరల్ చొరవతో మరిన్ని రష్యన్ కంపెనీలు ఇక్కడకు వస్తాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ ప్లాస్టిక్స్ విభాగంలో శ్రీసిటీలో ఇది నాల్గవ కంపెనీ కావడం వలన, ఆ రంగంలోని పరిశ్రమలకు అనుకూల పర్యావరణ వ్యవస్థ ఇక్కడ నెలకొంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. గెరాసిమెంకో మాట్లాడుతూ, భారతదేశంలో తమ తొలి తయారీ కేంద్రమైన శ్రీసిటీ ప్లాంట్ ప్రాముఖ్యతను వివరించారు. ఇది దిగుమతిపై ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో పాలిమైడ్ మరియు వివిధ రకాల ఇంజనీరింగ్ ప్లాస్టిక్‌లను ఉత్పత్తి చేయడానికి ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. ఈ ఉత్పత్తులను ఆటోమోటివ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కన్స్యూమర్ గూడ్స్, డిఫెన్స్, రైల్వే తదితర రంగాలలో విస్తృతంగా వినియోగిస్తారని చెప్పారు. భారత్ మార్కెట్ డిమాండ్, వ్యాపార అనుకూల విధానాలు, చెన్నై సమీపంలో అన్ని వసతులతో శ్రీసిటీ ఉండడం, శ్రీసిటీ యాజమాన్యం సహకారం పుష్కలంగా ఉండడం వంటి అంశాలు తమ పరిశ్రమ స్థాపనకు శ్రీసిటీ ఎంపికకు కారణాలుగా ఆయన పేర్కొన్నారు.




## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# నాలుగు కాళ్ళ మండపానికి మహర్దశ



గూడూరులోని ప్రసిద్ధ హిందూ దేవాలయం శ్రీ చెన్నకేశవస్వామి కళ్యాణ కార్యక్రమాలు జరిపేందుకు 1936వ సంవత్సరంలో కృష్ణ మైనింగ్ సహకారంతో దేవస్థానం ముందు పాత మద్రాసు రోడ్డు వెంబడి నాలుగుకాళ్ళ మండపాన్ని నిర్మించి 1939లో దేవ స్థానానికి అందజేశారు. ఆనాటి నుంచి దేవస్థానానికి అనుబంధంగా మండప వినియోగం జరుగుతోంది. గూడూరు తూర్పువీధి బొడ్డుచౌక్ ప్రాంతంలో ఐకానిక్‌గా నాలుగు కాళ్ళ మండపం గుర్తింపు పొందింది. స్థానికులు, పెద్దలు ఉదయం, సాయంత్రం వేళల్లో రచ్చబండలా కూడా మండపాన్ని ఉపయోగించేవారు. కాలక్రమేణా మండపం గుర్తింపుకు నోచుకోక అలాగే ఉండిపోయింది. ఇటీవల శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. స్థానికులు, ఆలయ సేవకుల విన్నపం మేరకు సంయుక్త సేవాసమితి వారు నాలుగు కాళ్ళ మండపాన్ని సుందరీకరణ చేసి పునర్వైభవం తీసుకురాగలిగారు. ఈ చరిత్రాత్మక కట్టడానికి మరిన్ని హంగులు దిద్ది చెన్న కేశవస్వామికి కళ్యాణ ఉత్సవం, పూజలు చేసుకునేందుకు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా సంయుక్త సేవా సమితి వ్యవస్థాపకులు చుట్టు అశోక్‌కుమార్‌ను స్థానికులు అభినందిస్తున్నారు. మండపం లోపల వేసిన రంగవల్లులతో పాటు శ్రీ కృష్ణ పరమాత్ముని స్వరూపం ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి.

## రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలసరుకుల పంపిణీ

గూడూరు డివిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్లో ఇటీవల సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 25మందికి నెలకు సరిపడా పలసరుకులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బత్తల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గున్నం సేవా ట్రస్ట్ ఆర్థిక సహకారంతో ప్రతి నెల నాలుగవ ఆదివారం ఈ కార్యక్రమం జరపటం అభినందనీయమని, గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి బెంగళూరులో ఉన్నప్పటికీ ఇక్కడ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో దశరథరామిరెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి, యద్దల అనిల్‌రెడ్డి, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా నటసార్వభౌముడి జయంతి

తెలుగు ప్రజల ఆరాధ్యదైవం 'విశ్వవిఖ్యాత నటసార్వభౌమ' నందమూరి తారకరామారావు 101వ జయంతిని తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. వాడవాడలా కార్యకర్తలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గూడూరులో మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ తరువాత భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోహిణమ్మ సేవలు మరువలేనివి



గూడూరు ప్రాంతంలో పేదల పెన్నిధిగా సేవలందిస్తున్న డాక్టర్ రోహిణి జన్మదినం సందర్భంగా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ ఆమెను శాలువాతో సత్కరించి, బొకేలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోహిణమ్మ వైద్యం పట్ల ఎంత అంకితభావంతో ఉంటారో, అంతే అంకితభావంతో ఇన్నర్‌వీల్ క్లబ్‌లోనూ, స్వచ్ఛంద సేవాసంస్థలకు తోడ్పాటు అందించడంలోనూ ముందుంటారని, రోహిణమ్మ సేవలను, మానవతా దృక్పథాన్ని ఎన్నటికీ మరువలేమని కొనియాడారు. ప్రగతి సేవా సంస్థ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 54వ హనుమజ్జయంత్యుత్సవాలు



గూడూరు మాలవ్యనగర్ లోని శ్రీరామ రక్షా కుటీరంలో 54వ శ్రీ హనుమజ్జయంతి ఉత్సవాలు ఈ నెల 31 నుండి జూన్ 2వ తేదీ వరకు జరుగు తున్నట్లు శ్రీరామ రక్షాకుటీరం కమిటీ సభ్యులు చిట్టిబాబు, పవన్ కుమార్, గురుగుహ తెలిపారు. పై కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు తీసుకొని స్వామివారి కృపా కటాక్షాలు అందుకోవాలని వారు కోరారు.

## సేవానాథం ట్రస్టు దాతృత్వం



శ్రీ సేవానాథం ట్రస్టు ద్వారా మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి అందిస్తున్న సేవలను పలువురు కొనియాడుతున్నారు. ఇటీవల వివిధ కారణాలతో చనిపోయిన పలువురు కుటుంబాలకు శ్రీ సేవానాథం ట్రస్టు వ్యవస్థాపకులు మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి ఈ నెల 27న ఆర్థిక సాయం చేశారు. అనారోగ్యంతో చనిపోయిన మనుబోలు, గిరిజన కాలనీకి చెందిన పాముల ప్రసాద్, అంబేద్కర్ నగర్‌కు చెందిన గుర్రం పోలమ్మ కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50వేలు, బేల్దారి పనులు చేస్తూ ప్రమాదానికి గురైన సురేంద్ర, గునపాటి ఏడు కొండలు కుటుంబాలకు రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆయన వెంట ట్రస్టు సభ్యులు గూడూరు వెంకటరమణ హోటల్ ఎం.డి రాంప్రసాద్, ఆనంద్, మహీధర్‌రెడ్డి, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## విధి వికటించింది...

# మృత్యువు కాటేసింది



- వైద్యం కోసం వెళ్తుంటే.. ఘోరం జరిగిపోయింది
- డ్రైవర్ నిద్రమత్తు అయిదుగురి ప్రాణాలు తీసింది

**వారంతా ఇందుకూరుపేట మండలం నరసాపురం గ్రామ వాసులే. అనారోగ్యంతో ఉన్న తమ్ముడి భార్యకు వైద్యం చేయించడం కోసం కారులో తమిళనాడుకు బయలుదేరిన ఆ కుటుంబ సభ్యులను మార్గమధ్యంలోనే మృత్యువు కాటేసింది. విధి ఆడే వింత నాటకంలో వారంతా ఒక్కసారిగా బలైపోయారు. ఒకరికోసం మరొకరు తోడుగా వెళ్ళి, ఆ కుటుంబసభ్యులు అత్యంత దయనీయంగా ప్రాణాలు కోల్పోవడంతో, వారి బిడ్డలు..బంధువులు పడే వేదన వర్ణనాతీతం. డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో ఘోర ప్రమాదం వారిని పొట్టనపెట్టుకుంది. పోలీసులు, మృతుల కుటుంబాల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.**



సమీర్



జయంతి - ఆదిశేషయ్య



నీరజ

నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం నరసాపురం గ్రామానికి చెందిన అడిగోపుల శ్రీనివాసులు, తన భార్య నీరజకు వైద్యం చేయించడానికి అన్న ఆదిశేషయ్య, వదిన జయంతితో కలిసి ఈనెల 27న కారులో తమిళనాడులోని వేలూరుకు బయలుదేరారు. మార్గ మధ్యంలో మనుబోలు వద్ద నీరజ తల్లి పద్మావతమ్మ కూడా కలసి వారితో వెళ్ళింది. అయితే, దురదృష్టం.. మరో గంటలో వారు వేలూరు ఆసుపత్రికి చేరుకుంటారనగా, డ్రైవర్ సమీర్ నిద్రమత్తులోకి జారిపోవడంతో కారు నాయుడుపేట– పూతలపట్టు రహదారి పక్కనే ఎం.కొంగర వారిపల్లి వద్ద ఉన్న డివైడర్‌ను అతివేగంతో ఢీకొంది. ఆ వేగానికి కారు డివైడర్‌లో ఇరుక్కుపోయి నుజ్జునుజ్జయిపోయింది. ఇంజన్ మొత్తం కారు నుండి విడిపోయి కాలువలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో డ్రైవర్ సమీర్ (23)తో పాటు ఆదిశేషయ్య (49), ఆయన భార్య జయంతి (42), పద్మావతమ్మ(58) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కారు వెనుక సీటులో ఉన్న శ్రీనివాసులు, నీరజలు తీవ్రంగా గాయ పడ్డారు. ఆ సమాచారం అందుకున్న పోలీసులు ఎంతో శ్రమించి, క్రేన్ సాయంతో రెండుగంటల పాటు కష్టపడి మృతదేహాలను బయటకు తీశారు. గాయపడ్డవారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సంగతి తెలుసుకున్న మృతుల కుటుంబాలు ఆసుపత్రికి తరలివచ్చి పెద్దపెట్టున రోదించారు.

### నీరజ కూడా మృతి :

ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన నీరజ(35) తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మరుసటి రోజు మంగళవారం మృతిచెందడంతో ఆ కుటుంబసభ్యుల రోదనావేదనలు వర్ణనాతీతం. అంతేకాదు, ఆమె భర్త శ్రీనివాసులుకు రెండు కాళ్ళు, ఎడమ చేయి విరిగిపోయాయి. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆయన్ను బంధువులు వైద్యచికిత్సల కోసం నెల్లూరుకు తీసుకువచ్చారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె 10వ తరగతిలో ఇటీవల మంచి మార్కులతో పాసైంది. కుమారుడు 8వ తరగతి చదువుతున్నాడు. ఈ ఘోరప్రమాదంలో ఒకేసారి తల్లిని, అమ్మమ్మను, పెద్దమ్మను, పెదనాన్నను కోల్పోయిన ఆ బిడ్డలు ఏకధాటిగా కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. వారి రోదన చూసి స్థానిక ప్రజలు కంటతడిపెడుతున్నారు.

### ఒకేరోజు రోడ్డుప్రమాదాల్లో..

## మరో నలుగురు కన్నుమూత

ఈనెల 27వ తేదీ సోమవారం రోజున జిల్లాలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మరో నలుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. కుప్పం నియోజకవర్గానికి చెందిన కార్తి (20) తమిళనాడుకు చెందిన అరవింద్ ఇద్దరూ కలసి మోటార్‌బైక్‌పై నెల్లూరు నుంచి చెన్నైకి వెళ్తూ, మనుబోలు వద్ద లారీని ఢీకొట్టడంతో, కార్తి తీవ్ర గాయాలతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మృతిచెందాడు. అరవింద్ పరిస్థితి విషమంగా ఉంది. అదేవిధంగా, వైఎస్సార్ జిల్లాకు చెందిన ఓ కుటుంబం నెల్లూరుజిల్లాలోని ఏఎస్‌పేట, కసుమూరు, వేనాడు దర్గాలను సందర్శించేందుకు ఆటోలో వెళ్తుండగా, ఆత్మకూరు వద్ద బోల్లాపడి కరీమున్నిసా (42) తల రోడ్డుకు బలంగా తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మరో దుర్ఘటనలో, అనంతసాగరం మండలంలోని గౌరవరం గ్రామానికి చెందిన వెంకటసుధ(29) అనే యువకుడు, కమ్మవారిపల్లిలో ఉంటున్న అక్క దగ్గరకు మోటార్‌బైక్‌పై వెళ్తూ, మార్గమధ్యంలో ఉప్పలపాడు వద్ద మరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఇంకొక ప్రమాదంలో అదేరోజున సైదాపురంలో క్రేన్ ఢీకొనడంతో మల్లారపు పెంచలమ్మ(46) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

### మరో మైలురాయిని అధిగమించిన

# శ్రీసిటీ - ఎన్‌జీసీ పరిశ్రమ

## • 1000వ గేర్‌బాక్స్ యూనిట్ ఎగుమతి




శ్రీసిటీలోని చైనా దేశానికి చెందిన ఎన్‌జీసీ గ్రూప్ అనుబంధ సంస్థ ఎన్‌జీసీ ట్రాన్స్‌మిషన్ చెన్నై ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ, తాము ఉత్పత్తి చేసిన 1000వ గేర్‌బాక్స్ యూనిట్‌ను ఈనెల 27న ఎగుమతి చేయడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని అధిగమించింది. పరిశ్రమ ఆవరణలో ఇటీవల చేపట్టిన కార్యక్రమంలో శ్రీసిటీ సెజ్ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ డి.సత్యనారాయణరావు జెండా ఊపి ఉత్పత్తులను ఎగుమతికి తరలించారు. ఈ సందర్భంగా కంపెనీ డైరెక్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ, 1000వ గేర్‌బాక్స్‌ను అమెరికాలోని తమ యుఎస్ కస్టమర్ జిఇ రెన్యూవబుల్ ఎనర్జీకి ఎగుమతి చేస్తుండడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. దాంతోపాటు, అనేక ఇతర పవనశక్తి రంగాలకి చెందిన తమ గ్లోబల్ కస్టమర్‌ల డిమాండ్‌ను సమర్థవంతంగా తీర్చడానికి శ్రీసిటీ ప్లాంట్‌ను విస్తరిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఎన్‌జీసీ బృందాన్ని అభినందించిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ప్రిసిషన్ ఇంజినీరింగ్ రంగంలో పేరుగాంచిన ఎన్‌జీసీ గ్రూప్ వేగవంతమైన వృద్ధి పట్ల సంతోషం వ్యక్తం చేశారు. చైనా వెలుపల ఈ గ్రూప్‌కు చెందిన మొట్టమొదటి ప్లాంట్ శ్రీసిటీలో ఏర్పాటు కాగా, ఈ ప్లాంట్ విస్తరణతో వారి మార్కెట్ వాటా మరింత పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది

## • వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ శంకర్

నేటి జీవనశైలి, మారిపోయిన ఆహారపుటలవాట్ల వల్ల లేనిపోని వ్యాధులన్నీ వస్తున్నాయని, ప్రజారోగ్యం ప్రమాదంలో పడిపోయిందని వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రార్, ప్రస్తుతం గుంటూరులోని వైద్యకళాశాల పార్మకాలజీ హెచ్ఓడీ డాక్టర్ శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. నెల్లూరు ఆసుపత్రిలో ఈనెల 28న ప్రజాసైన్స్ ఉద్యమ నిర్మాత దివంగత డాక్టర్ విజయ కుమార్ 9వ వర్ధంతి కార్యక్రమలో ఆయన పాల్గొని జీవనశైలి




మార్పులతో పలురకాల వ్యాధులు వస్తున్నాయని, ముఖ్యంగా బీపీ, షుగర్, ఊబకాయం వంటి సమస్యలు పెరిగిపోతున్నాయని తెలిపారు. అదేవిధంగా గుండెజబ్బులు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా చుట్టుముడుతున్నాయన్నారు. చిన్నవయసులోనే షుగర్ వంటి వ్యాధులు వస్తున్నాయన్నారు. కలుషిత ఆహారం తినడం, అంతా కాలుష్యం వ్యాపిస్తుండడంతో రకరకాల కొత్త జబ్బులు కోరలు చాస్తున్నాయన్నారు. ప్రతిదీ కల్తీ అయిపోతున్న నేటికాలంలో ఏది తినాలో, ఏది తినకూడదో కూడా తెలియని స్థితి ఏర్పడుతోందన్నారు. మంచి ఆహారపుటలవాట్లతోనే మంచి ఆరోగ్యం సమకూరుతుందని అన్నారు. నగరంలోని డాక్టర్ జీవీకె ట్రస్ట్ ఆధ్వర్యంలోని నెల్లూరు ఆసుపత్రిలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకుల్లో ఒకరైన మాల్యాద్రి మాట్లాడుతూ, డాక్టర్ విజయకుమార్ స్ఫూర్తితో ప్రజారోగ్యం కోసం ఇలాంటి చైతన్యవంతమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు వేణు, శ్రీనివాసులు, నారాయణ, న్యాయవాదులు అబ్బయరెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ విజయకుమార్ స్మారకంగా రక్తదానం



దివంగత ప్రజాడాక్టర్ విజయ కుమార్ స్మారకంగా నెల్లూరు ఆసుపత్రిలో ఈనెల 28న రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. జిల్లాలో గతంలో సారా ఉద్యమ కన్వీనర్‌గా, ప్రజాసైన్స్ ఉద్యమ నేతగా డాక్టర్ విజయకుమార్ చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెడ్‌క్రాస్ రక్తనిధి వారు రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. నెల్లూరు ఆసుపత్రి ఎం.డీ గోపాల్, ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.




ఈ సందర్భంలో కవిసామ్రాట్ విశ్వనాథసత్యనారాయణ గారు చక్కటి పదాలు వాడి ఆ సందర్భాన్ని ఎంత అద్భుతంగా మన కన్నుల ముందు ఆవిష్కరించారో చూడండి. ఆ పద్యం అర్థం మనకు వెంటనే తెలియకపోయినా! శబ్దచిత్రం మాత్రం కన్నుల ముందు ప్రత్యక్షమవుతుంది

***నిష్ఠావర్ష దమోఘ మేఘపటలీ నిర్గచ్ఛ దుద్యోతిత***
***స్వేచ్ఛైరమ్మదమాలికా యుగప దుజ్జృంభన్మహాఘోర బం***
***హిష్ఠ స్ఫూర్జదుషండ మండిత రవాహీన క్రియా ప్రౌఢి ద్రా***
***ఘిష్ఠంబై యొకరావ మంతట నెసంగెన్ ఛిన్నచాపంబునన్!***

ఇది మీ కనుల ముందు ఊహించండి!

నిలకడగా వర్షం కురుస్తున్నప్పుడు దట్టమైన మబ్బులలో అగ్నికణాల మాలలు ఒక్కసారిగా బహిర్గతమై దండలుగా ఏర్పడి బ్రహ్మాండమైన శబ్దంతో పిడుగులు అదేపనిగా ఒకదానివెంట మరొకటి (series)గా వస్తే ఎలా ఉంటుందో! అలాంటి శబ్దం ఆ విల్లు విరిగినప్పటి ఫెళఫెళా రావాలు అంత తీవ్రంగా వచ్చినవట!

అంతేనా, ఈ పద్యంలో ఇంకొక చమత్కారం కూడా వున్నది! రాముడు నీలమేఘశ్యాముడు, "మేఘపటలీ నిర్గచ్ఛ" అని వ్రాశాడాయన.

మేఘమండలం నుండి వెలువడిన అని అర్థం! నీలమేఘశ్యాముడి చేతిలో విరిగి అంత ధ్వని పుట్టిందట!

భాస్కర రామాయణంలోని పద్యమొకటి చూడండి!

***కులగిరులెల్ల బెల్లగిలె గుంభిని యల్లలనాడె దిగ్గజం***
***బులుబెదిరెన్ భుజంగపతి బొమ్మరవోయె బయోధులన్నియుం***
***గలగె దిగంతముల్ వగిలె గన్నుని దారలు రాలె సూర్యచం***
***ద్రుల గతులు తప్పె మేఘములు దూలె నజాండము మ్రోసె నయ్యెడన్.***

ఆ శబ్దానికి పర్వతాలు పెళ్లగింపబడినవట, దిక్కులుమోసే ఏనుగులు బెదిరిపోయినవట, ఆదిశేషువుకు దిమ్మతిరిగి పోయిందట, సముద్రాలు క్షోభించినవట, భూమి అల్లల్లాడి పోయిందట, దిక్కులు పిక్కటిల్లినవట, నక్షత్రాలు రాలిపోయినవట, సూర్యచంద్రులు గతులు తప్పారట.

అంత భయంకరమైన శబ్దం పుట్టినదట!

ఒక్కొక్క కవి యొక్క ఊహా వైభవం ఎంత అద్భుతంగా ఉందో చూడండి.

హమ్మయ్య అని ఊపిరి పీల్చుకున్నాడు జనకుడు. ఈయన అసలు పేరు సీరధ్వజుడు. మిథిలా నగరాధీశులందరినీ 'జనకుడు' అనే పిలుస్తారు.

మూలపురుషుడు "నిమి" నుండి ఈయన ఇరవై మూడవ మహరాజు!

అప్పటికి దాదాపు 6 సంవత్సరాలనుండి శివధనుస్సు గురించి ప్రచారం జరుగుతూనే ఉంది. ఒక్కొక్క రాజు రావడం, ధనుస్సు ఎత్తలేకపోవడం జనకుడి మీదికి దండెత్తిరావడం. ఒకసారి అందరూ మూకుమ్మడిగా దండెత్తివచ్చి కోటను సంవత్సరం పాటు ముట్టడించారు. కోటలో సైన్యసంపద తరిగిపోసాగింది, ఆహారధాన్యాలు నిండుకున్నాయి, అప్పుడు జనకుడు దేవతల సహాయంతో వారిని ఎలాగోలా ఓడించి సాగనంపాడు! ఇప్పుడిక ఆ బెడద తీరిపోయింది! అందుకు ఆ నిట్టూర్పు! హమ్మయ్య! అని!

విశ్వామిత్రుడికి కన్నుల వెంట ఆనందబాష్పాలు రాలాయి!

(ఎందుకని? జగత్కల్యాణకారకుడి కళ్యాణానికి తాను కారకుడనయ్యానని)

పురజనులంతా సంబరపడిపోయారు, స్త్రీ జనమంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు!

మరి తరుణి సీత!

తనువంతా పూచిన మందారమయ్యింది!

తానొక సిగ్గుల మొగ్గ అయ్యింది!

జనకుడు వెంటనే తన మంత్రులను అయోధ్యకు పంపించాడు. వారు శీఘ్రముగా వెళ్లి ఈ వార్త దశరథమహారాజు చెవిన వేశారు!

తనతో తీసుకువెళ్ళిన బాలరాముడిని మహర్షి కళ్యాణరాముడిని చేశాడు అనే వార్త విని దశరథుడి మనసులో ఆనందతరంగాలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. తక్షణమే భరత, శత్రుఘ్న, మంత్రి, సామంత, పురోహితులు కులగురువు వశిష్ఠులవారు వెంటరాగా మిథిలా నగరానికి పయనమయ్యాడు.

సీరధ్వజుడు(జనకుడు) సాంకాశ్యపురాధీశుడు అయిన తన తమ్ముడు కుశధ్వజుని రావించాడు!

సీత, ఊర్మిళ జనకుడి కూతుళ్ళు, మాండవి, శృతకీర్తి కుశధ్వజుడి పుత్రికలు.

ఒక వివాహమనుకొన్నది నాలుగు వివాహాలుగా మారాయి!

సీతారాములు
ఊర్మిళలక్ష్మణులు
మాండవిభరతులు
శృతకీర్తిశత్రుఘ్నులు

ఈ జంటలకు వివాహం చేయ పెద్దలు నిశ్చయించారు!

సర్వలోకమనోహరుడైన రాముని వివాహక్రియ జరిపించండీ ఓ ప్రభూ! ఓ మహర్షీ! అని జనకమహారాజు వశిష్ట మహర్షిని కోరగా!

***"రామస్య లోకరామస్య క్రియాం వైవాహికీం ప్రభో!"***

సీతాకళ్యాణ వైభోగమే! రామ కళ్యాణ వైభోగమే!

అందుకు అంగీకరించిన వశిష్టమహర్షి విశ్వామిత్ర, శతానందులను ముందిడుకొని అగ్నివేదిక నిర్మించాడు.

తరువాత జనకమహారాజు తన కూతురు సీతను సర్వాలంకార భూషితను అగ్నిసాక్షిగా రాముని ఎదురుగా ఉంచి

***ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ***
***ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా.***

ఇదిగో! నా కుమార్తె అయిన సీత ! ఈమె నీకు సహధర్మచారిణి కాగలదు, ఈమెను స్వీకరింపుము. నీ చేయితో ఈమె చేయి పట్టుకొనుము (పాణిం గృహ్ణీష్వ పాణినా అనగా చేయిచేయికలుపుట, ఇదీ మన సంప్రదాయం).



***పతివ్రతా మహాభాగా ఛాయేవానుగతా సదా!***
***ఇత్యుక్త్వా ప్రాక్షిపద్రాజా మన్త్రపూతం జలం తదా.***

మహాభాగ్యవంతురాలగు ఈమె నిన్ను ఎప్పుడూ నీడలా అనుసరిస్తుంది అని పలికి మంత్రపూతమైన జలం వదిలాడు జనకుడు.

అదేవిధంగా మిగిలిన ముగ్గురు రాజకుమారులకు వివాహం జరిగింది!

శ్రీ రామచంద్రుడి వివాహం ఘనంగా జరిగింది. ఆ సమయంలో దేవతలు పుష్పవృష్టి కురిపించారు!

వివాహం అయిన తరువాత నలుగురుకొడుకులూ ముందు భార్యలతో వెళుతుండగా దశరథుడు వెనుకనుండి వారిని చూస్తూ మహదానందపడ్డాడు.

సీతారాముల వివాహమైన తరువాత అందరి వద్ద సెలవు తీసుకొని విశ్వామిత్ర మహర్షి హిమాలయాలకు వెళ్ళిపోయాడు.

• అసలు విశ్వామిత్ర మహర్షి పాత్రను ఎంత హఠాత్తుగా ప్రవేశపెట్టాడో అంతే హఠాత్తుగా ఉపసంహరించాడు వాల్మీకి మునీంద్రుడు!

ఆయన తన యాగ రక్షణ తాను చేసుకోగలడు, తాటకి తాట తీయగలడు!

కానీ! రాబోయే రోజులలో ఎన్నో ఘనకార్యాలు చేయవలసి ఉన్న రాముడికి సకలశస్త్రాస్త్ర జ్ఞానమివ్వాలి, రాముడికి గురువు అని అనిపించుకోవాలి! అదీ ఆయన తపన! నిజానికి విశ్వమిత్రుడికన్నా గొప్పగా యుద్ధవిద్యలు తెలిసిన వాడు ముల్లోకాలలో ఎవడూ లేడు! మహావిష్ణువు, మహాదేవుడు తప్ప! రావణ వధ జరగాలంటే రాముడి పెళ్ళి కావాలి! ఇది చాలా ముఖ్యం. అందుకే రెండు ముఖ్యమైన పనులను తానే స్వయంగా దగ్గరుండి నిర్వర్తించాడు మహర్షి!

అదీ విశ్వామిత్రుడు అంటే! లోకకళ్యాణం కోసం తపించే మహానుభావుడు! అంతేగాని కోపిష్టి వాడు విశ్వామిత్రుడు కాదు!

కొత్తకోడళ్ళను తీసుకుని సపరివారంగా అయోధ్యకు బయలుదేరాడు దశరథమహారాజు. మార్గమధ్యంలో ఒక అరణ్యంలో ప్రవేశించారు.

అరణ్యం గుండా ప్రయాణిస్తున్నప్పుడు ఎన్నో అపశకునాలు కనపడ్డాయి దశరథునకు, పక్షులు వికృతమైన కంఠంతో కూస్తున్నాయి, మృగాలు వారి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నాయి. దశరథమహారాజు మనస్సు ఏదో కీడు శంకిస్తుంది, ఏదో విపత్తు వాటిల్లే ప్రమాదం ఆయనకు కనపడుతోంది.

.. (సశేషం)

# జయం మనదే!

(మొదటిపేజీ తరువాయి)

అధికారపీఠంపై కూర్చుంది. ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో తమకు ఎదురు లేదన్నట్లుగా కొన్ని రాష్ట్రాల్లో పాతుకుపోయింది. ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, త్రిబుల్ తలాక్ విధానానికి మంగళం, కామన్ సివిల్ కోడ్, నూతన పార్లమెంటు భవన నిర్మాణం, గుజరాత్‌లో స్టాట్యూ ఆఫ్ యూనిటీ పేరుతో సర్దార్ వల్లభాయ్ పటేల్ స్మారకం ఏర్పాటు వంటి అనేక ప్రజాకర్ష కార్యక్రమాలతో పాలన సాగించింది. మరోవైపు ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టడంలో భాగంగా జిఎస్టీ విధానాన్ని అమలుచేసి మంచి ఫలితాలని సాధించింది. నోట్ల రద్దు విషయంలో విమర్శలు ఎదుర్కొన్నా, అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థల్ని, ఆర్థిక కుంభకోణాలని అడ్డుకోవడంలో సఫలం అయ్యిందన్న ప్రశంసలని అందుకుంది. కరోనా కష్టకాలంలో సంయమనం పాటించి ప్రపంచాన్ని వణికించిన మహమ్మారిని సమర్థవంతంగా ఎదుర్కొందన్న ఘనతను తమ సొంతం చేసుకుంది. దేశవ్యాప్తంగా కొన్ని కోట్ల ఇళ్ళని నిర్మించడంతో పాటు స్వచ్ఛభారత్ నినాదంతో మరుగుదొడ్లను ఏర్పాటు చేయడంలో అగ్రస్థాయిలో నిలిచింది. ప్రతి ఇంటికీ త్రాగునీరు, ప్రతీ కుటుంబానికీ గ్యాస్ కనెక్షన్ అన్న పథకాలని చురుకుగా ప్రజలలోకి తీసుకెళ్లి సమర్థవంతంగా అమలుచేసింది. వందేభారత్ వంటి రైళ్లను పరిచయం చేయడం, జాతీయ రహదారులను విస్తృతస్థాయిలో నాలుగు లేదా ఆరులైన్లకు విస్తరింపచేయడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజా, వాణిజ్య రవాణా వ్యవస్థను మెరుగుపరచింది. దేశ సరిహద్దులో పహారా కాస్తున్న త్రివిధ దళాలలో ఆత్మస్థైర్యాన్ని నింపి.. దేశం వారికి అండగా ఉంటుందన్న భరోసా కల్పించింది.

దక్షిణ భారతదేశంలోని రాష్ట్రాలని నిర్లక్ష్యం చేసిందన్న అపవాదుతో పాటు ఆంధ్రాకి ప్రత్యేకహోదా ఇచ్చే విషయంలో ద్రోహం చేసిందన్న చెడ్డపేరు కూడా తెచ్చుకుంది. లలిత్ మోడీ, నీరవ్‌మోడీ, విజయ్‌మాల్యా వంటి ఆర్థిక నేరగాళ్ళని దేశం నుండి తప్పించేసిందన్న నిందతో పాటు దేశం అంటే ప్రధాని, అదానీ, అంబానీ అనేలా వ్యవహరించిందన్న విమర్శ కూడా కమలదళంపై ఉంది.

బీజేపీని ఎలాగైనా మూడవసారి అధికారంలోకి రానీయకుండా అడ్డుకోవాలన్న గట్టి పట్టుదలతో ప్రతిపక్షాలన్నీ ఏకమయ్యాయి. రాజకీయాల పట్ల అవగాహన, అనుభవం లేని అయిదు పదుల వయస్సులో ఉన్న కాంగ్రెస్ నాయకుడు గాంధీ కుటుంబ వారసుడు రాహుల్‌గాంధీతో జతకట్టి మోడీని గద్దె దించాలని గట్టి ప్రయత్నాలు చేశాయి. అపార రాజకీయ, పరిపాలనా అనుభవంతో దేశ ప్రధానిగా పగ్గాలు చేపట్టి.. పది సంవత్సరాలుగా తనదైన ముద్రతో ప్రపంచ దేశాలని సైతం ఆకర్షిస్తున్న 73 సంవత్సరాల నరేంద్ర మోడీకి, అపరిపక్వ ఉపన్యాసాలతో, అనుభవం లేని రాజకీయ విన్యాసాలతో రాజకీయ సర్కస్ చేస్తున్న 53 సంవత్సరాల రాహుల్ గాంధీకి దేశంలో జరిగిన పొలిటికల్ వార్‌లో అంతిమ విజయం ఎవరిదో జూన్ 4న తేలనుంది.

## రాష్ట్రంలో జగన్ Vs బాబు!

ఈ సారి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికలకి చాలా ప్రత్యేకత, ప్రాధాన్యతా ఉన్నాయి. మన రాష్ట్రంలో కూడా ఎన్నికలని 2014 ముందు, ఆ తరువాత అన్నట్లుగానే చూడాలి. హెలికాప్టర్ ప్రమాదంలో రాజశేఖరరెడ్డి మరణించాక, తెలంగాణ నుండి రాష్ట్రం విడిపోయాక తొలిసారిగా 2014లో జరిగిన ఎన్నికలలో వై.ఎస్.పై ఉన్న అభిమానాన్ని, ఆ కుటుంబంపై కలిగిన సానుభూతిని, జగన్‌మోహన్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారన్న పాపభీతినీ సైతం పక్కనపెట్టి అనాధాంధ్రా ప్రజలు అనుభవానికే పట్టం కట్టారు. వై.ఎస్. వారసుడిని కాదని బాబుకి జైకొట్టారు. ఒక విధంగా చెప్పాలంటే ఆ ఎన్నికలలో జరిగింది త్రిముఖ పోటీ. టీడీపీ, వైసీపీలతో పాటు అప్పటివరకూ అధికారంలో వున్న కాంగ్రెస్‌పార్టీ కూడా ఆనాటి ఎన్నికలలో పోటీ చేసింది. అయితే, రాష్ట్రాన్ని ముక్కలుచేసి ఆంధ్రప్రదేశ్‌ని దిక్కులేకుండా చేసిందన్న కసితో తెలుగు ప్రజలు ఆ పార్టీ అభ్యర్థులకి ఎక్కడా డిపాజిట్లు కూడా దక్కనీయలేదు. రెండు ప్రాంతీయ పార్టీలు టీడీపీ, వైసీపీల మధ్యే పోరు సాగింది. టీడీపీ అధికారంలోకి వచ్చింది. అయితే 2019 నాటికి సీన్ మారింది. ప్రజలు ఊహించిన స్థాయిలో రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపించలేకపోయారన్న విమర్శలతో పాటు అడ్డదారిలో తన వారసుడు లోకేష్‌కి అధికారం కట్టబెట్టి పెత్తనం అప్పచెప్పారన్న చెడ్డపేరుని కూడా చంద్రబాబు మూటకట్టుకున్నారు. నత్త నడక నడిచిన రాజధాని నిర్మాణం, పట్టాలెక్కని పోలవరం, రాజధాని భూముల చుట్టూ తిరిగిన ఇన్సైడర్ ట్రేడింగ్, సొంత సామాజిక వర్గానికి కొమ్ము కాస్తున్నారన్న ప్రచారం.. బాబుని అప్రదిష్టపాలు చేశాయి. మరో వైపు బాబు వైఫల్యాలని ఎత్తిచూపుతూ వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి 'ప్రజా సంకల్పయాత్ర' పేరుతో చేపట్టిన పాదయాత్ర, యాత్రలో ఆయన ఇచ్చిన నవరత్నాల హామీలు, ఒక్క అవకాశం ఇవ్వండి అంటూ ఆయన చేసిన అభ్యర్థన ప్రజలని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఫలితంగా 2019 ఎన్నికలలో ఆంధ్ర ఓటర్లు జగన్‌మోహన్‌రెడ్డికి బ్రహ్మరథం పట్టారు. అనూహ్యంగా 175కి 151 స్థానాలలో వైసీపీ జెండా ఎగిరేలా ఆ పార్టీని దీవించారు.

నమ్మకం, విశ్వసనీయత అని దివంగత నేత రాజశేఖరరెడ్డి తరచూ చెప్పే వ్యాఖ్యలకే జగన్ ప్రాధాన్యత ఇచ్చారు. తాను మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలని అమలు చేయడం ప్రారంభించారు. సంక్షేమ పథకాల పేరుతో ఒక్క బటన్ నొక్కడం ద్వారా లక్షల కోట్ల రూపాయలని నేరుగా ప్రజల ఖాతాలో జమ చేశారు. ఖజానాలో డబ్బులు వున్నా లేకున్నా ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా ఠంచనుగా జనం అకౌంట్లలోకి జగనన్న కాసులు చేరేలా చర్యలు తీసుకున్నారు. నాడు – నేడు అంటూ స్కూళ్ళని, ఆసుపత్రులని ఆధునీకరించారు. కరోనా కష్టకాలంలో జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన డబ్బులు బాగా ఉపయోగపడ్డాయన్న ప్రశంసని అందుకున్నారు. పక్క రాష్ట్రం తెలంగాణ ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు, దేశ ప్రధాని నరేంద్రమోడీలతో మంచి స్నేహ సంబంధాలని ఏర్పరచుకున్నారు. పదమూడు జిల్లాలని 26 జిల్లాలు చేశారు. బెజవాడలో అంబెడ్కర్ విగ్రహం పెట్టారు. పక్క రాష్ట్రానికి చెందిన బీసీ నాయకుడు కృష్ణయ్యకి రాజ్యసభ ఇచ్చి గౌరవించారు. సచివాలయానికి వెళ్ళడం మానుకున్నారు. ఒక్కరోజు కూడా మీడియా ముందుకి రాలేదు. కార్పొరేట్ తరహాలో పాలనా పెత్తనమంతా తన సొంత మనుషులకి అప్పజెప్పారు. వాళ్లకి సలహాదారులు, రాజ్యసభ సభ్యులు, మంత్రులూ అంటూ పదవులు కట్టబెట్టి తన ప్రతినిధులుగా వాళ్ళచేతే మాట్లాడించారు. అన్నింటినీ మించి తనపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదు అని పదే పదే చెప్పుకుంటుండిన చంద్రబాబుని జైలుకి పంపి, బాబు కూడా అవినీతిపరుడే అని ముద్ర వేయడంలో సక్సెస్ అయ్యారు.

కేంద్రంతో పోరాడి రాష్ట్రానికి తెస్తానన్న ప్రత్యేకహోదా జగన్ తేలేదు. ఒక రాజధానికే దిక్కులేకుండా ఉన్న రాష్ట్రంలో మూడు రాజధానులు పెడతానన్న ఆయన ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. పాదయాత్ర సమయంలో హామీ ఇచ్చిన మద్యపాన నిషేధం సాధ్యం కాలేదు. ఆయన అమలు చేస్తానన్న జాబ్ క్యాలండర్ అమలుకి నోచుకోలేదు. ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తం చేసిన ప్రభుత్వ ఉద్యోగుల ఆటలు సాగలేదు. తనపై తిరగబడ్డ చెల్లెలు షర్మిలను ఆయన నియంత్రించలేదు. ఇలా మంచి చెడులతో అయిదేళ్ల వైసీపీ పాలన ముగిసిపోయింది. ప్రజలు ఆయనకి ఇచ్చిన ఒక్క అవకాశం గడువు తీరిపోయింది. ఇప్పుడు మళ్ళీ ఎన్నికలు జరిగాయి. పూర్తిగా జీవం కోల్పోయిందనుకున్న టీడీపీకి జవసత్వాలు వచ్చాయి. ఇక్కడ మళ్ళీ జగన్ వైఫల్యాలే బాబుకి ప్రచార అస్త్రాలుగా మారాయి. ప్రజాక్షేత్రంలో మాటల తూటాలుగా ఆయనకు ఉపకరించాయి. బీజేపీ, జనసేనలు బాబుకు తోడవడంతో బాబులో ఆశలు చిగురించాయి. డెబ్బై అయిదు సంవత్సరాల తన వయస్సును కూడా పక్కనపెట్టి ప్రాణాలకి తెగించి ప్రజల మధ్య తిరిగారు. యాభై సంవత్సరాల వయస్సులో కేవలం అయిదేళ్ల పరిపాలనా అనుభవం ఉన్న జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి రాత్రీపగలూ శ్రమించారు. తన నలభై సంవత్సరాల రాజకీయ అనుభవాన్ని, పద్నాలుగున్నర సంవత్సరాల పాలనా సామర్థ్యాన్ని అంతా ఉపయోగించి పోరాడారు.

వీరిద్దరి భవిష్యత్తు కూడా జూన్ 4న తేలబోతోంది. సిద్ధం!... అంటూ జగన్, సంసిద్ధం!!.. అంటూ బాబు చేసిన యుద్ధంలో విజేతలెవరో ప్రజలు నిర్ణయించేశారు. తమ నిర్ణయాన్ని మే 13వ తేదీనే బ్యాలెట్ బాక్సుల్లో(ఇవీఎంలలో) గుట్టుగా నిక్షిప్తం చేశారు. జూన్ 4 ఉదయం 8గంటల నుండి అధికారులు ఆ గుట్టును రట్టు చేయనున్నారు. కౌంటింగుకి కౌంట్‌డౌన్ మొదలైనప్పడి నుండీ నేతల గుండెల్లో టెన్షన్ మొదలయ్యింది. పోలింగు అనంతరం జరిగిన హింసాత్మక సంఘటనలతో అధికార యంత్రాంగం అలర్ట్ అయ్యింది. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి అటెన్షన్‌గా ఉంది. ఓట్లు లెక్కించే రోజు ఎలాంటి సంబరాలు చేసుకోకూడదని ఎన్నికల కమిషన్ కూడా నిషేధం విధించింది. ఇక అన్ని పార్టీల అధినేతలు, నాయకులు జయం మనదే... అనుకుంటూ ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ, ఎవరి ధీమాలో వారున్నారు. మరి ఆ నలుగురి తీర్పు ఎలా ఉందో చూడాలంటే మరో నాలుగు రోజులు, అంటే జూన్ 4వ తేదీ వరకూ వేచి ఉండాల్సిందే!

# డాక్టరేట్ అందుకున్న పీ.టీ. జగన్నాథం




పి.టీ గోపాలాచారి వ్యాపార సంస్థల ద్వారా రాణిస్తూ, అంతే సమానంగా సామాజిక స్పృహతో సమాజసేవకి కూడా ప్రాధాన్యత కల్పిస్తున్న పీ.టీ. జగన్నాథం చేస్తున్న సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ అందుకున్నారు. కొత్త ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో "కాన్స్టిట్యూషనల్ క్లబ్ న్యూ ఢిల్లీ" సంస్థ నుండి జగ్గు ఈ అవార్డుని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు, భారత ప్రభుత్వ ఉన్నతాధికారులు, సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు. వివిధ రంగాలలో సమాజ సేవలందించిన కొంతమందిని ఎంపిక చేసి "స్టార్ ఇండియన్ లీడర్ షిప్ అవార్డ్ 2024" పేరుతో సంస్థ నిర్వాహకులు ఈ డాక్టరేట్‌ను అందించారు. పీ.టీ.జగన్నాథంకి 'లాయర్' అభినందనలు.

# ఆకట్టుకున్న డా. విశ్వర్షి వాసిలి కవితోపన్యాసం



చెన్నైలోని 'వేద విజ్ఞాన వేదిక' ఆధ్వర్యంలో ఇటీవల చెన్నై టీనగర్‌లోని ఆంధ్ర క్లబ్‌లో నిర్వహించిన 'తరతరాల తెలుగు కవిత' 149వ ప్రసంగ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సారస్వతవేత్త డా.విశ్వర్షి వాసిలి కవితోపన్యాసం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తాను రచించిన కవితాత్మక కావ్యం 'నేను'పై చేసిన ప్రసంగం ఆలోచనాత్మకంగా ఉండి 'నేను' లోని అసంఖ్యాక భావకోణాలను శ్రోతలను అలరించింది. తొలి తెలుగు యోగిక కావ్యం 'నేను'లోని వైవిధ్యం, వినూత్నమైన అంశాలను ఎంతో కవితాత్మకంగా, భావస్ఫోరకంగా ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన 'ఏడో రుతువు' వర్తమాన వచన కవితా సంపుటి ఆవిష్కరణోత్సవం కన్నులపండువగా జరిగింది. వేద విజ్ఞాన వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి ఆ కవితా సంపుటిని ఆవిష్కరించగా, కార్యదర్శి కందనూరు మధు, ప్రొ. విస్తాలి శంకరరావు, సూర్యప్రకాశరావు, శివప్రసాద్ తదితరులు ఈ పుస్తకావిష్కరణలో పాల్గొని పుస్తకప్రతులను అందుకున్నారు. డా. విశ్వర్షి బహుగ్రంథకర్త అని, వైవిధ్యంతో కూడిన రచనలు చేశారని, యోగాలయ, అతీంద్రియ రహస్యాలైన యౌగిక సాహిత్యం, జీవన గీత, యౌగిక గీత, గీతా రహస్యాలు, నేను, జీవనసంహిత వంటి రచనలు ఆయన రచనా ప్రతిభకు నిదర్శనాలని, వ్యక్తిత్వ వికాసానికి సంబంధించి కూడా ఆయనెన్నో రచనలు చేసి లబ్ధప్రతిష్టులయ్యారని ఈ సందర్భంగా వేదిక అధ్యక్షులు జేకేరెడ్డి వివరించారు. అనంతరం, వేద విజ్ఞాన వేదిక అధ్యక్ష కార్యదర్శులు డా. విశ్వర్షి వాసిలిని ఘనంగా సత్కరించారు. చెన్నై నగరంలోని తెలుగు ప్రముఖులు, కవిత్వాభిమానులు పెద్దసంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హోటళ్ళు ఫుల్లు

(మొదటిపేజీ తరువాయి)

అన్నట్లుగా బెట్టింగ్ రాయుళ్ళు పండుగ చేసుకుంటున్నారు. ఇప్పటికే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే పాతిక వేల కోట్ల రూపాయల మేరకు బెట్టింగులు జరుగుతున్నాయని విశ్వసనీయ సమాచారం. ప్రతి ఎన్నికలలోనూ ఈ బెట్టింగులు షరామాములే. అయితే, ఈసారి ఎన్నికలు చాలా ప్రతిష్టాత్మకమైనవి కావడం, ప్రజలు ఎవరివైపు ఉన్నారో అర్థంకాకపోవడంతో రెండు ప్రధాన పార్టీల శ్రేణుల నుండి భారీ మొత్తంలో చేతులు మారాయని తెలుస్తోంది. ముఖ్యంగా వైసీపీ కంచుకోట నెల్లూరుజిల్లాలో ఈసారి ఆ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయన్న దానిపైన కూడా భారీగా బెట్టింగ్‌లు జరిగాయని వార్త.

ఈ క్రమంలో జూన్ 3, 4వ తేదీలలో నెల్లూరు నగరంలోని హోటల్ రూములన్నీ బుకీలే బుక్ చేసేసుకున్నారని అంటున్నారు. కౌంటింగుకి ముందురోజే పందెం రాయుళ్ళు హోటల్ గదులకు చేరుకొని బెట్టింగులకు సిద్ధమైపోతున్నారని వినికిడి. సొంత పనుల మీదో లేక వ్యాపార వ్యవహారాలతోనో నగరానికి వచ్చేవాళ్లకి పెద్ద హోటళ్ళలో ఎక్కడా రూములు దొరకడం లేదని చెప్తున్నారు. మూడు, నాలుగు తేదీలలో మాత్రం తామేం చేయలేమని హోటళ్ళ మేనేజర్‌లు చేతులెత్తేస్తున్నారంట.

# 1 నుంచి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు



నెల్లూరులోని ఎఫ్-2 బ్యాడ్మింటన్ అకాడమీలో జూన్1 నుంచి రాష్ట్రస్థాయి ఓపెన్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ చెప్పారు. ఇటీవల నెల్లూరులోని అసోసియేషన్ కార్యాలయంలో ఆయన ఆ పోటీలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. క్రీడాకారులు తమ ప్రతిభాపాటవాలు పెంచుకునేందుకు ఇలాంటి పోటీలు దోహదం చేస్తాయని అంటూ, పోటీల నిర్వాహకులను ఆయన అభినందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకట్, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

# హనుమజ్జయంతి వేడుకలు

నెల్లూరు సంతపేటలో వెలసివున్న శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో జూన్ 1 నుంచి 5రోజుల పాటు హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా 1న స్వామివారికి గంధర్వ వాహనం, 2న యాళి వాహనం, 3న ధవనోత్సవం, 4న హంసవాహనం, 5న సింహ వాహనోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకలకు తరలివస్తారు కనుక, ఆలయ ఛైర్మెన్ చందోలు సతీష్‌కుమార్, ఇఓ దర్గయ్య ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి



స్వదేశంలోనూ, విదేశాల్లోనూ మత వ్యతిరేకశక్తుల నుంచి హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు బత్తిన సాయికుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల నెల్లూరులోని వర్ధమాన సమాజం భవనంలో, సృజన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన 'ప్రపంచానికే ఆదర్శం హిందూ ధర్మం' అనే అంశంపై ఆయన ప్రవచించారు. ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవడం ఒక బాధ్యతగా భావించాలని ఆయన సూచించారు. సామాజిక సమరసత రాష్ట్ర కన్వీనర్ కోవూరు జయప్రద, పెనుబాక సుజితారెడ్డి, పి.నాగేశ్వరమ్మ, డాక్టర్ మారం సుధాకర్, మురళీమోహన్‌రావు, మురళీరెడ్డి, పవన్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు. తొలుత వర్ధమాన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# భక్తిశ్రద్ధలతో 'సంకటహర చతుర్థి'

'సంకటహర చతుర్థి'ని పురస్కరించుకుని ఈనెల 26న నెల్లూరులోని వినాయకుని గుడులు, మందిరాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కృష్ణయోగ మందిరంలోని వరసిద్ధి వినాయక ఆలయం, టౌన్‌హాలు వద్ద ఉన్న గణపతి మందిరం, పప్పులవీధిలోని శ్రీ సిద్ది విఘ్నేశ్వరాలయం, వేదాయపాళెం, శివాజీసెంటర్, రైతుబజారు తదితర ప్రాంతాల్లోని గణేశమందిరాల్లో విశేషపూజలు చేశారు.

# క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ



నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్న వేసవి శిబిరంలో క్రీడల్లో శిక్షణ పొందుతున్న 900 మంది క్రీడాకారులకు ఈనెల 20న ఏసీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. హైటెక్ ఫార్మా అధినేత రమణారెడ్డి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-203 గవర్నర్ పలగాటి శ్రీనివాసులురెడ్డి, అసోసియేషన్ నిర్వాహకులు దాసరి అనంతరామారావు, గుర్రం వెంకటసురేంద్రబాబు, అరిగెల సాయిరామ్, రఘురామ్ ముదిరాజ్, నలుబోలు బలరామయ్యనాయుడు, బాసం శేషగిరిరావు తదితరులు పాల్గొని పౌష్టికాహారాన్ని సమకూర్చిన రమణారెడ్డిని ఘనంగా సన్మానించారు.



# టెన్త్ విద్యార్థులకు.. బీఎమ్మార్ ట్రస్ట్ పురస్కారాలు

ఇటీవల 10వ తరగతిలో 475 మార్కులకు పైగా సాధించిన 450 మంది విద్యార్థులకు రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఆధ్వర్యంలోని బీఎమ్మార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతిగా ఒకరికి రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా ముగ్గురికి రూ.7 వేలు, 3-4 బహు మతులుగా రూ.5 వేలు, రూ.4 వేల వంతున 8 మందికి నగదు బహుమతులిచ్చారు. మిగిలినవారికి కన్సొలేషన్ బహుమతులందజేశారు. ఈ సందర్భంగా యాదవ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వర్లు ఈనెల 26న నెల్లూరులోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, చదువులో బాగా రాణిస్తేనే విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు, డాక్టర్ మాదాల వెంకటరాజేష్, జిల్లా సంఘం నాయకులు కొండయ్య, మహేష్, సురేష్, బీసీ సంఘం నాయకుడు దేవరాల సుబ్రహ్మణ్యం, ఎనెల్ ఆసుపత్రి ఛైర్మెన్ నాగేంద్ర, డాక్టర్ పిట్టి మల్లికార్జున, ఆల్ఫామెరైన్ యజమాని సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

# దైవారాధనతోనే విజయం



దైవారాధనతోనే విజయం సిద్ధిస్తుందని, ప్రతిఒక్కరూ భగవంతుని చిత్తశుద్ధితో ఆరాధించి ఆధ్యాత్మిక విజయాలెన్నో సాధించాలని ఇనమడుగు సత్యానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీహరితీర్థస్వామి ఆకాంక్షించారు. ప్రముఖ ఆధ్యాత్మిక గ్రంథ రచయిత కే.శే పోలూరు హనుమజ్జానకిరామశర్మ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా, ఈనెల 26న నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలోని జూనియర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారకభవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, పోలూరువారు రచించిన 'విజయపథం' గ్రంథంలోని పలు విషయాలను ఆయన వివరించారు. అనేక యుద్ధాల్లో విజయం సాధించిన అర్జునునికి కురుక్షేత్ర రణరంగంలో శ్రీకృష్ణపరమాత్ముడు గీతోపదేశం చేయడమే 'విజయపథం' గ్రంథంలోని సారాంశమన్నారు. ప్రతిఫలాపేక్ష లేని కర్తవ్యమే ఆ శ్రీకృష్ణ పరమాత్మ మార్గమన్నారు. సమాజ సేవాభావంతో కర్తవ్య నిర్వహణే దైవారాధనగా భావించి విజయాలు సాధించాలని ఆయన ఉద్బోధించారు. అనంతరం నిర్వాహకులు శ్రీ శ్రీహరితీర్థస్వామిని ఘనంగా సన్మానించారు. స్థానిక పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో, వేదం రాధాకృష్ణమూర్తి నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో డా. చీమకుర్తి వెంకటేశ్వరరావు, అవధాని కోట రాజశేఖర్, నలుబోలు బలరామయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# కౌంటింగ్ పరిశీలనకు అబ్జర్వర్ల నియామకం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తిస్థాయిలో పరిశీలించేందుకు నలుగురు అబ్జర్వలను భారత ఎన్నికల సంఘం నియమించింది. నెల్లూరు రూరల్ మండల పరిధిలోని కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ జూన్ 4న ప్రారంభం కానుండగా, నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం అబ్జర్వర్లను నియమించింది. కందుకూరు, నెల్లూరు రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలకు అబ్జర్వర్‌గా రామ్‌కుమార్ గౌతమ్, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాలకు టీజీ అఖిలాష్‌కుమార్, కోవూరు, నెల్లూరు సిటీ, ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు నితిన్‌సింగ్ బదారియ, సర్వేపల్లికి జయేంద్రకుమార్ విజయవత్ అబ్జర్వర్లుగా వ్యవహరించనున్నారు.

# 'క్రీడా భారతి'కి కొత్త కమిటీ

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నెల్లూరులో ఇటీవల క్రీడాభారతి జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. క్రీడాభారతి జిల్లా ప్రెసిడెంట్‌గా కొండారెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా సుబ్బయ్య, ప్రమోద్‌రెడ్డి, లక్ష్మి, మల్లికార్జున్, జనరల్ సెక్రటరీగా సీహెచ్ శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అదేవిధంగా, జాయింట్ సెక్రటరీగా ఇమ్రాన్, ట్రెజరర్‌గా శ్రీహరిరెడ్డితో పాటు సభ్యులుగా మురళి, రఘురామిరెడ్డి, కోటారెడ్డి, శ్రీనివాస్, దివ్యప్రకాష్, దిలీప్, శ్రీధర్, ప్రసన్న, సౌమ్య, విజయకుమారి, వెంకటేశ్వరి, మౌనిక, నవీన్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సమీర్‌లు ఎన్నికయ్యారు. క్రీడాభారతి రాష్ట్ర సెక్రటరీ ధనుంజయ్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి అబ్జర్వర్లుగా వ్యవహరించారు.

## టూకీగా...



### డీసీపల్లిలో పట్టపగలే చోరీ

మర్రిపాడు మండలం డీసీపల్లిలోని సతీష్ కుటుంబ సభ్యులతో కలిసి, ఈనెల 26వ తేది ఉదయం గ్రామంలో జరుగుతున్న తిరునాళ్లకు వెళ్లి మధ్యాహ్నం వచ్చేసరికి, దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 4 సవర్ల బంగారు నగలు, వెండి కాలిపట్టీలు, రూ.40వేలు దోచుకుపోయారు. బాధితుని ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

### దంపూరులో రక్తదాన శిబిరం

విడవలూరు మండలం దంపూరులోని ప్రభుత్వ పాఠశాలలో ఇటీవల మద్దులూరు పద్మ చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటైన రక్తదానశిబిరంలో 50 మందికి పైగా యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు మల్లి కిశోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం గ్రామస్తులు రక్తదాతలను అభినందించారు.

### మైపాడులో భూసార పరిరక్షణపై అవగాహన

ఇందుకూరుపేట మండలం మైపాడు రైతుభరోసా కేంద్రంలో ఇటీవల పీఎం ప్రణామ్ కార్యక్రమంలో భాగంగా రైతులకు భూసార పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఎంఏఓ రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ, పంటలసాగులో రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి నానో ఎరువులు వాడాలని, పశువుల ఎరువుతో భూమిని సారవంతం చేసుకోవాలన్నారు.

### పెంచలకోనలో శ్రీకాళహస్తి ఇఓ

రాపూరు మండలం పెంచలకోనలో కొలువైవున్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామిని ఇటీవల శ్రీకాళహస్తి దేవస్థానం ఇఓ ఎస్‌వి నాగేశ్వరరావు దర్శించుకున్నారు. పెంచలకోన ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి దైవదర్శనం చేయించారు. అనంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

### వడ్డిపాళెం పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

విడవలూరు మండలం వడ్డిపాళెంలో వెలసివున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవాలయం 2వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

### బొడ్డువారిపాళెంలో మహిళా మహోత్సవం

కొడవలూరు మండలం బొడ్డువారిపాళెంలో ఇటీవల ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా మహోత్సవం కార్యక్రమం జరిగింది. గ్రామంలోని బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతపై, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మతో పాటు అంగన్‌వాడీ హెల్పర్ వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

### మైపాటివారికండ్రిగలో అధికారుల తనిఖీలు

చేజర్ల మండలంలోని మైపాటివారికండ్రిగలోని ప్రభుత్వ భూముల్లో ఉన్న తెల్లరాయిని అక్రమార్కులు కొందరు తవ్వి తరలించుకుపోతున్నారనే ఫిర్యాదులతో మైనింగ్ అధికారులు ఇటీవల తనిఖీలు చేపట్టారు. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించారు. అక్రమ మైనింగ్‌పై కఠినచర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ సుమతి, వీఆర్ఓ పెంచలయ్య తెలిపారు.

### పొంగూరులో కోడిపందాలు.. 9 మంది అరెస్ట్

మర్రిపాడు మండలంలోని పొంగూరులో కోడిపందాల స్థావరంపై పోలీసులు ఈనెల 26న దాడిచేసి, పందాలు నిర్వహిస్తున్న 9 మందిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు కోళ్ళు, 4370 రూపాయలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విశ్వనాథరెడ్డి తెలిపారు.

### ముదివర్తి కోదండరామునికి విశేష పూజలు

విడవలూరు మండలం ముదివర్తి గ్రామం గాంధీగిరిజన కాలనీలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయం తృతీయ వార్షిక వేడుకల సందర్భంగా స్వామివారిని శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం శ్రీ సీతారాముల కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# నిత్య స్మరణీయులు తల్లితండ్రులు

## ➢ మాతాపితరుల సంస్మరణలో పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డి







***దైవ సమానులైన తల్లిదండ్రులను స్మరించుకోవడం, వారి స్మారకంగా ఆధ్యాత్మిక సాహితీ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా పెట్టుకున్న మన నెల్లూరీయులు, శాంతా బయోటెక్నిక్స్ అధినేత 'పద్మభూషణ్' కే.ఐ.వరప్రసాదరెడ్డి మే 26న తమ తల్లిదండ్రుల స్మృత్యంకంగా నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ చాగంటి వారి ప్రవచనం అందరినీ భక్తిభావ సమన్వితులను చేసింది.***

తల్లితండ్రులు నిత్య స్మరణీయులని, వారి స్మారకంగా ఏడాదికోసారైనా ఒక మంచి కార్యక్రమం నిర్వహించాలనే తలంపుతో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త.. వాచస్పతి, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు ఆధ్యాత్మిక ప్రవచనాన్ని ఏర్పాటు చేశామని, గత పదిహేడేళ్లుగా తమ గురువైన శ్రీ చాగంటి ప్రవచనాలను తాను వింటూ, పదిమందికీ వినిపించే అవకాశాన్ని కలుగజేయడం తన భాగ్యమని పద్మభూషణ్ కెఐ వరప్రసాద్‌రెడ్డి అన్నారు. తమ తల్లితండ్రులైన కీర్తిశేషులు కోడూరు వేంకటరమణారెడ్డి–శాంతమ్మలను స్మరించుకుంటూ 'మాతా పితరుల సంస్మరణ స్మృత్యంజలి' పేరుతో మే 26 ఆదివారం నాడ హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని తన నివాసంలో పద్మభూషణ్ కెఐ వరప్రసాద్ రెడ్డి దంపతులు నిర్వహించిన కార్యక్రమం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 'దేవ పితృ కార్యాభ్యాం..న ప్రమది తవ్యమ్' అని యజుర్వేదంలో ఒక వేదవాక్కు ఉందని, పూజ్య గురువుల అనుగ్రహ భాషణంలో తాను ఆ గొప్ప మాటను విన్నానని, 'దైవ కార్యాలకి, పితృకార్యాలకి, ఏపాటి ఏమరుపాటు ఉండకూడదు.. అలక్ష్యం ఉండకూడదు.. అలసత్వం ఉండకూడదు.. విముఖత ఉండకూడదు' అని ఒక్కమాట ద్వారా వేద ధర్మం పేర్కొందన్నారు. తమ తల్లి శాంతమ్మ నిరంతరం దైవచింతనతో ఉండేదని, పుస్తకాల అధ్యయనం ఆమెకెంతో ఇష్టమని, తల్లి ద్వారా అదే తనకు కూడా అబ్బిందని ఆయన అన్నారు. 'అనేక విజయాలు సాధించే కొడుకు కన్నా, విలువలున్న కొడుకుగా ఉండాలని' తన మాతృమూర్తి ఆకాంక్షించేదని ఆయన చెప్పారు. మాతా పితరుల రుణం తీర్చుకోవాలని, వారిని తలచుకుంటూ మంచి ఆధ్యాత్మిక ప్రవచనాలను వినాలని, తద్వారా తాను తన జీవనవిధానాన్ని మెరుగులు దిద్దుకుంటూ ఉంటానని అన్నారు. ముఖ్యంగా తన ఆధ్యాత్మిక గురువైన చాగంటి వారి అనుగ్రహభాషణం తనతో పాటు ఎంతో మందిని ప్రభావితం చేస్తుందని, గత 17 సంవత్సరాలుగా వారి ప్రవచనాలను ఈ సందర్భంగా ఏర్పాటుచేస్తున్నామన్నారు. తమ కోర్కెను మన్నించి చాగంటి వారు రావడం తమకెంతో ఆనందం కలిగిస్తోందన్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు 'అన్నమయ్య సంకీర్తనల' వైశిష్ట్యం గురించి రాసిన వ్యాస సంకలనం 'అన్నమయ్య పదగోపురం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. అన్నమయ్య రచించిన 'అపూర్వ కీర్తనలు' శ్రీ వేంకటేశ పదములు' అనే రెండు ఆడియోలకు కూడా ఆవిష్కరణోత్సవం చేశారు. శాంత–వసంత ట్రస్టు ఆధ్వర్యంలో ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రముఖ నాసికా వేణుగాన కళాకారుడు సాయి హేమంత్ బృందం వారు ఆలపించిన 'శ్వాసమురళిపై అన్నమయ్య సంకీర్తనలు' అందరినీ ఆకట్టుకున్నాయి.

### అన్నమయ్య కీర్తనలు.. అద్భుతం–అపూర్వం - చాగంటి



పదకవితా పితామహుడు, ఆ శ్రీవేంకటేశ్వరుని భక్తుడు, శరణాగతి తత్వంతో, మధురభక్తితో తిరుమలేశుని కీర్తిస్తూ రచించిన శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి సంకీర్తనలు ఎంతో అపూర్వమని, అత్యద్భుతమని 'అన్నమయ్య పదగోపురం' వ్యాస సంకలనాన్ని సమీక్షిస్తూ చాగంటి కోటేశ్వరరావు వివరించారు. అన్నమయ్య సంకీర్తలను గొప్పదనాన్ని ఆయన తన ప్రవచనంలో అమోఘంగా విశదీకరించి అందరినీ భక్తిభావతన్మయుల్ని చేశారు. ఆ వ్యాససంకలనంలోని వ్యాసాలన్నీ అన్నమయ్య సంకీర్తనల వైశిష్ట్యాన్ని వివిధ కోణాల్లో దర్శించి అద్భుతంగా రచించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సారస్వతవేత్త వెంకటగిరి రాజా సాయికృష్ణ యాచేంద్ర, అన్నమయ్య సంకీర్తనల గాయకులుగా ప్రఖ్యాతిచెందిన శోభారాజ్, బాలకృష్ణప్రసాద్ తదితరులతో పాటు ఎంతోమంది ప్రముఖులు పాల్గొన్నారు.


REMEMBERING OUR FOUNDER



Shri. Nalagatla Krishna Reddy Garu
10 Nov 1935 – 2 June 2022

NAGARJUNA
GROUP OF RESTAURANTS
SINCE 1984

*Today, He May Not be in Our Midst Physically, But He has Left Behind an Incredible Impression on the Many Lives that He has Touched. His Story will be Told in the Years to Come to Inspire Many More Generations about Our Great Patriarch. And His Food Legacy will be Carried On, With the Same Passion that He Passed On.*

HE LOVED HEARTILY, GAVE GENEROUSLY & LIVED FEARLESSLY.
AND AS HE WOULD ALWAYS SAY,
"I AM HERE, DON'T FEAR!"

**Fondly Remembered By**
**Family & Friends**


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com